TGTEL/26/A4985

# ఆదాబ్ సైబరాబాద్

www.adaabcyberabad.com
epaper.adaabcyberabad.com
adaabcyberabad@gmail.com

ADAAB CYBERABAD

ఎడిటర్ : బిల్లాల్‌పూర్‌సారా శివ కుమార్ | సంపుటి : 1 | సంచిక : 17 | శుక్రవారం , జూలై 31, 2026 | పేజీలు - 4 | వెల: 5/-

EDITOR : BILLALPURSARA SHIVA KUMAR | VOLUME : 1 | ISSUE: 17 | 31-07-2026 (FRIDAY) | PAGES: 4 | RS : 5/-

## పీఐబీ ఆధ్వర్యంలో 'వార్త' వర్క్‌షాప్



**- కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు మరింత చేరువ చేయాలన్న**
**- పీఐబీ ఏడీజీ శృతి పాటిల్**

ఆదాబ్ సైబరాబాద్, హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను మరింత సమర్థవంతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని పత్రికా సమాచార కార్యాలయం (పీఐబీ) అదనపు డైరెక్టర్ జనరల్ శృతి పాటిల్ అన్నారు. గురువారం హైదరాబాద్ కవాడిగూడలోని సీజీవో టవర్స్‌లో పీఐబీ ఆధ్వర్యంలో నిర్వహించిన 'వార్త' వర్క్‌షాప్లో ఆమె మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ గత 12 సంవత్సరాల విజ యాలు, వివిధ మంత్రిత్వ శాఖలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై ఈ వర్క్‌షాప్‌లో చర్చించారు. ఇంటర్ మీడియా పబ్లిసిటీ కోఆర్డినేషన్ కమిటీ (ఐఎంపీసీసీ) పరిధిలోని కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖలు, విభాగాలు, ప్రభుత్వ రంగ సంస్థల (పీఎస్‌యూలు) ఉన్నతాధికారులు పాల్గొని తమ శాఖల ప్రధాన విజయాలు, ప్రజా సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ప్రజలకు ప్రభుత్వ పథకాలను మరింత సమర్థవంతంగా చేరవేసేందుకు భవిష్యత్ ప్రచార కార్యక్రమాలు, మీడియా ద్వారా విస్తృత ప్రచారం చేపట్టాల్సిన చర్యలపై అధికారులు విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా పీఐబీ విధులు, కేంద్ర ప్రభుత్వ విధానాలు, పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు చేపడుతున్న కార్యక్రమాలపై శృతి పాటిల్ ప్రజెంటేషన్ ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వ సంస్థలకు ప్రచార కార్యక్రమాల అమలులో పీఐబీ ఎల్లప్పుడూ సహకారం అందిస్తుందని ఆమె తెలిపారు. ప్రభుత్వ పథకాలు ప్రతి అర్హులైన లబ్ధిదారునికి చేరి, వారు వాటి ప్రయో జనాలను పొందేలా చూడటమే పీఐబీ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ కేంద్ర ప్రభుత్వ సంస్థల ఉన్నతాధికారులు, పీఐబీ, సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ (సీబీసీ) అధికారులు పాల్గొన్నారు.

# 2034 వరకూ నేనే ముఖ్యమంత్రిగా ఉంటా

**◆ప్రపంచంతో పోటీ పడాలంటే ఈ విద్యా నాణ్యత సరిపోదు..**
**◆రెసిడెన్షియల్ స్కూళ్లకు పీవీ శ్రీకారం చుట్టారు.**

హైదరాబాద్, జులై 30 : విద్యావ్యవస్థ రాష్ట్రంలో బలపడిందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. తెలంగాణలోనూ ప్రపంచ స్థాయి ప్రమాణాలతో కూడిన విద్యావ్యవస్థ ఉండాలనేది తమ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. 2034 వరకు తానే ముఖ్యమంత్రిగా ఉంటానని స్పష్టం చేశారు. (గురువారం) ఎంసీహెచ్‌ఆర్‌లో ఫిన్‌లాండ్, జర్మనీ దేశాలలో పర్యటించి వచ్చిన ఉపాధ్యాయుల బృందంతో ఇంటరాక్షన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు కే.కేశవరావు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. 'టీచర్ ఇంటర్నేషనల్ ఎక్స్‌పోజర్ విజిట్ అండ్ ఎడ్యుకేషనల్ ఎక్స్‌చేంజ్' కార్యక్రమంలో భాగంగా ఫిన్‌లాండ్, జర్మనీ దేశాల్లో ఉపాధ్యాయుల బృందం పర్యటించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. రెసిడెన్షియల్ స్కూళ్లకు పీవీ శ్రీకారం చుట్టారు.. జవాహర్‌లాల్ నెహ్రూ, ఇందిరాగాంధీ, పీవీ నర్సింహారావు వేసిన పునాదులతో ఇప్పుడు మన దేశంలో లైఫ్‌స్పాన్ పెరిగిందని సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు. రెసిడెన్షియల్ స్కూళ్లకు పీవీ శ్రీకారం చుట్టారని




తెలిపారు. ఇక్కడి పిల్లలు ప్రపంచంతో పోటీ పడాలని చెప్పారు. విద్యలో నాణ్యత పెరగాలని, పిల్లలకు పౌష్టికాహారం అందాలని సూచించారు. తెలంగాణలో తనకు తెలిసిన మేధావులు ఇద్దరేనని.. వారిలో కేకే, జైపాల్‌రెడ్డి అని అభివర్ణించారు. విద్య విషయంలో బాధ్యత తీసుకోవాలని కేకేను అడిగానని చెప్పుకొ చ్చారు. ఆయన సలహాదారుగా అనేక సూచనలు చేస్తున్నారని తెలిపారు. వెనకబాటుతనానికి కారణం చదువు లేకపోవడమేనని చెప్పుకొచ్చారు. చదువుకున్న ఎస్సీలు సమాజంలో మంచి స్థానంలో ఉన్నారని వివరించారు. ఆస్తులున్నా.. చదువు లేకపోతే సమాజంలో వెనకపడి పోతున్నారని వెల్లడించారు. విద్యార్థులను సమాజంలో గొప్పగా నిల బెట్టగలిగిన శక్తి ఉపాధ్యాయులకు ఉందని కొనియాడారు. ప్రతీ విద్యార్థిపై రూ. 1,08,000 ఖర్చు తాము చేస్తున్నామని సీఎం పేర్కొన్నారు. పీవీ నర్సింహారావు రెసిడెన్షియల్ స్కూల్స్ ప్రారంభించారని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. సర్వేల్‌లో ఆ స్కూల్లోనే ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు చదువుకున్నారని ప్రస్తావించారు. స క్రమశిక్షణ లేకపోతే ఎంత తెలివి ఉన్నా పనికిరారని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

## మహిళా, శిశు సంక్షేమ శాఖపై సీతక్క సమీక్ష.



హైదరాబాద్, జులై 30: అంగన్వాడీ వ్యవస్థను మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. సచివాలయంలో మహిళా, శిశు సంక్షేమ శాఖపై మంత్రి సీతక్క సమీక్ష నిర్వహించారు. అంగన్వాడీ కేంద్రాలను మరింత బలోపేతం చేసేందుకు జిల్లాల వారీగా అంగన్వాడీ టీచర్లు, ఆయాలతో సదస్సులు నిర్వహించి వారి సూచనలు స్వీకరించాలని అధికారులను ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రాల్లో టాయిలెట్లు, తాగునీరు, విద్యుత్ వంటి మౌలిక వసతుల సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని సూచించారు. అలాగే అంగన్వాడీ టీచర్లు, ఆయాల యూనిఫార్మ్‌లను అక్టోబర్ మొదటి వారంలోగా సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో అడాప్షన్ సెంటర్లు ఏర్పాటు చేసే దిశగా చర్యలు వేగవంతం చేయాలని మంత్రి సీతక్క సూచించారు. ప్రస్తుతం రాష్ట్రంలో 17 అడాప్షన్ సెంటర్లు ఉన్నాయని అధికారులు మంత్రికి వివరించారు. అంగన్వాడీ టీచర్లు, ఆయాల నియామక ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని, ఇప్పటికే 16 జిల్లాల్లో నోటిఫికేషన్లు జారీ కాగా మిగిలిన జిల్లాల్లో కలెక్టర్లతో సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లల పోషకాహారం, ఎదుగుదలపై శాంపిల్ సర్వే నిర్వహించి, దాని ఆధారంగా పోషకాహార కార్యక్రమాలను మరింత మెరుగుపరచాలని పేర్కొన్నారు. కేంద్రం నుంచి వచ్చే నిధులు లాప్స్ కాకుండా ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రతి రూపాయిని సమర్థవంతంగా వినియోగించాలని మంత్రి అధికారులకు సూచించారు.

## రెండు దఫాలుగా ఏడు లక్షల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు



భద్రాద్రి కొత్తగూడెం, జులై 30: గత ప్రభుత్వం రూ.8 లక్షల కోట్ల మేర అప్పులు చేసిందని, పీకల్లోతు కష్టాల్లో ఉన్నప్పటికీ ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలను అందజేస్తున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. (గురు వారం) జిల్లాలోని చంద్రుగొండ మండలం మం గయ్య బంజర గ్రామంలో 45 లక్షల రూపా యల నిధులతో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్, లో - లెవల్ కాజ్‌వేను మంత్రి ప్రారంభిం చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇందిర మ్మ ఇండ్లు, ఉచిత కరెంటు, మహిళలకు ఉచిత బస్సు, రాష్ట్రవ్యాప్తంగా మొదటి దశలో 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చామన్నారు. రెండో విడతలో 2.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసినట్లు వెల్లడించారు. దీంతో రెండు దఫాలుగా ఏడు లక్షల ఇందిరమ్మ ఇళ్లను పేదవారికి మంజూరు చేసినట్లు తెలిపారు. హైదరాబాద్ నగరంలో లక్ష ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామని మంత్రి వెల్లడించారు. మూడు, నాలుగో విడతలో ప్రతి ఒక్క అర్హుడైన పేదవాడికి ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని చెప్పారు. ఇందిరమ్మ ఇండ్ల విషయంలో కులం, మతం, పార్టీ అని చూడటం లేదన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేస్తున్న ఈ ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వాన్ని ప్రజలు ఆదరించాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు.

## విద్యార్థులపై లాఠీఛార్జ్ చేస్తే.. అమిత్ షా ఎందుకు మౌనంగా ఉన్నారు



న్యూఢిల్లీ, జులై 30: నీట్ ప్రశ్న పత్రం లీక్, విద్యా వ్యవస్థలో సంస్కరణల కోసం ఆందోళనకు దిగిన వారిపై పోలీసులు లాఠీఛార్జ్ చేశారని రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులపై బాష్పవాయువు కూడా ప్రయోగించారని తెలిపారు. పోలీసుల తీరుపై కేంద్రం హోం శాఖ మంత్రి అమిత్ షా ఎందుకు మౌనంగా ఉన్నారని ఆయన ప్రశ్నించారు. గురువారం రాజ్యసభలో విద్యార్థుల ఆందోళనల నేపథ్యంలో చోటు చేసుకున్న పరిణామాలపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా ఖర్గే మాట్లాడుతూ.. ఇంతటి దారుణ ఘటనకు అమిత్ షాదే బాధ్యత అని స్పష్టం చేశారు. దీనిపై ఇంతవరకు అమిత్ షా ఎలాంటి ప్రకటన చేయలేదంటూ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఢిల్లీ ఘటనపై నోరు విప్పి మాట్లాడాలంటూ కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాను ఖర్గే డిమాండ్ చేశారు. పేపర్ లీక్ వల్ల విద్యార్థులు నష్టపోవాలా? అని కేంద్రాన్ని ఆయన సూటిగా ప్రశ్నించారు. నీట్ పేపర్ లీక్ కారణంగా.. చాలామంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల ఆవేదనను అర్థం చేసుకోవాలని ఈ సందర్భంగా కేంద్రానికి ఖర్గే స్పష్టం చేశారు. విద్యార్థులకు జరిగిన నష్టాన్ని ఎవరు భర్తీ చేయాలి? అని మోదీ సర్కారును ఆయన నిలదీశారు. పేపర్ లీక్ అనేది తలదించుకోవాల్సిన అంశమని ఖర్గే అభివర్ణించారు. 2024లోనే ఈ బిల్లు ఎందుకు తీసుకురాలేదని కేంద్రాన్ని ఆయన ప్రశ్నించారు. యువత ఉగ్రవాదులు కాదు కదా? అని కేంద్రానికి ఖర్గే చురకలంటించారు.

# ఫార్ములా-ఈ కేసు

**- నేడు కోర్టుకు హాజరుకానున్న కేటీఆర్**

హైదరాబాద్, జులై 30: ఫార్ములా ఈ కార్ రేస్ కేసు మరోసారి తెరపైకి వచ్చింది. ఫార్ములా ఈ-కారు రేసు కేసు విచారణలో భాగంగా మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శుక్రవారం నాంపల్లి ఏసీబీ ప్రత్యేక కోర్టుకు హాజరుకానున్నారు. ఈ కేసులో ట్రయల్ ప్రారంభం కానుండటంతో కోర్టు ఆదేశాల మేరకు ఆయన వ్యక్తిగతంగా హాజరవుతున్నారు. అసలు ఫార్ములా ఈ కార్ రేస్ వివాదం ఏమిటంటే? : గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో హైదరాబాద్‌లో నిర్వహించిన ఫార్ములా ఈ-రేస్ నిబంధనలకు విరుద్ధంగా జరిగిందనేది ప్రధాన ఆరోపణ. క్యాబినెట్ అనుమతి లేకుండానే రూ.55 కోట్ల ప్రభుత్వ నిధులను యూకేకు చెందిన ఫార్ములా ఈ ఆపరేషన్స్ (ఎఫ్ఈఓ) సంస్థకు బదిలీ చేశారని కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాత ఏసీబీ దర్యాప్తు చేపట్టి కోర్టులో ఛార్జ్‌షీట్ దాఖలు చేసింది. అయితే ఈ ఆరోపణలను కేటీఆర్ పూర్తిగా తోసిపుచ్చారు. ప్రజల దృష్టిని మళ్లించేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం ఈ కేసులను తెచ్చిందని విమర్శించారు. ఏసీబీ దాఖలు చేసిన ఛార్జ్‌షీట్‌లో గత ప్రభుత్వంలో మున్సిపల్ శాఖ మంత్రి ఉన్న కేటీఆర్‌ను ప్రధాన నిందితుడిగా (ఏ1) పేర్కొన్నారు. ఈ కేసులో అప్పటి మున్సిపల్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అరవింద్ కుమార్ (ఏ2), హెచ్ఎండీఏ మాజీ చీఫ్ ఇంజనీర్ బీఎల్ఎన్ రెడ్డి (ఏ3) లతో పాటు క్రీడా కన్సల్టెంట్ కిరణ్



మల్లేశ్వరరావు (ఏ4), ఎఫ్ఈఓ ప్రతినిధి అల్బెర్టో లాంగో (ఏ5)లను కూడా నిందితులుగా చేర్చారు. జైల్లో పెట్టాలని చూస్తున్నారు : ఫార్ములా ఈ-కార్ రేసింగ్ కేసులో కేటీఆర్ ఇప్పటికే ఏసీబీ విచారణకు పలుమార్లు హాజరయ్యారు. గతంలో విచారణకు హాజరైన సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ చట్టాలపై ఉన్న గౌరవంతో విచారణకు వెళ్లానని ఆయన వివరించారు. ఒకటే ప్రశ్నగౌరవంతోే ఏసీబీ అధికారులు తిప్పి తిప్పి అడిగారని, అసలు ఈ కేసులో అవినీతి ఎక్కడ ఉందని అవినీతి నిరోధక శాఖ గౌరవంతో అధికారులని తానే ప్రశ్నించినట్లుగా కేటీఆర్ చెప్పారు.

## 'బిహార్ స్టైల్' జెన్‌గ్ నిరసన

నీట్ పేపర్ లీకేజ్, విద్యా వ్యవస్థలోని లోపాలను అరికట్టాలని డిమాండ్ చేస్తూ ఇటీవలే దేశ రాజధాని దిల్లీ జెన్ జెడ్ నిరసనలతో అట్టుడికిపోయింది. సీజేపీ, నిరుద్యోగ యువత ధర్నాలు, ఆందోళనలు, నిరసన ప్రదర్శనలతో హోరెత్తించారు. ఈ క్రమంలో నిరసనకారులపై లాఠీచార్జ్ చేయగా పలువురు గాయపడ్డారు. అలాగే చెదురు మదురు హింసాత్మక ఘటనలు సైతం జరిగాయి. అయితే బిహార్‌లో జెన్ జెడ్ చేసిన నిరసనలు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారాయి. నిరసన ప్రదర్శనల కొన్ని వీడియో క్లిప్‌లు ఫన్నీగా ఉండడంతో నెటిజన్లకు నవ్వు తెప్పిస్తున్నాయి. పట్నా సహా రాష్ట్రంలోని ఇతర నగరాల్లో ఆందోళన చేపట్టారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అయితే ఈ నిరసనల సమయంలో బిహార్ విద్యార్థులు చేసిన చేష్టలు అందరికి

## హైదరాబాద్‌కు ఆరెంజ్ అలర్ట్.



హైదరాబాద్, జులై 30: హైదరాబాద్‌ను వర్షాలు ముంచెత్తుతున్నాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో నగరంలోని పలు ప్రాంతాలు జలమయమవుతుండగా.. మరో రెండు రోజుల పాటు భారీ వర్షాలు కొనసాగే అవకాశముందని వాతావరణ శాఖ హెచ్చరించింది. రంగారెడ్డి, మేడ్చల్, హైదరాబాద్ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేయగా.. ముఖ్యంగా సాయంత్రం వేళల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశముందని అధికారులు హెచ్చరిస్తున్నారు. మాన్సూన్, డిజాస్టర్, స్టాటిక్ థీమ్స్ ఆధారంగా హైడ్రా అధికారులు ప్రత్యేక అలర్ట్ జారీ చేసి. పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. వర్షాల ప్రభా వంతో నగరంలోని వాటర్ లాగింగ్ ప్రాంతాల్లో నీరు నిల్వ కాకుండా భారీ మోటర్లను ఏర్పాటు చేశారు. ముఖ్యంగా ఐటీ కారిడార్‌లోని రాయ దుర్గం, బయోడైవర్సిటీ, ఐకియా జంక్షన్ ప్రాంతాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. మరోవైపు ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద నీరు చేరడంతో హుస్సేన్ సాగర్ నిండుకుండలా మారింది. కూకట్‌పల్లి, బుల్కాపూర్, పికెట్ నాలాల నుంచి పెద్దఎత్తున వరద నీరు హుస్సేన్ సాగర్‌లోకి చేరుతోంది. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జీహెచ్ఎంసీ అధికారులు సూచించారు.

శుక్రవారం,
జూలై 31, 2026

TGTEL/26/A4985

ఆదాబ్ సైబరాబాద్
ADAAB CYBERABAD

2

## సారో జెర మా ఊరు రోడ్డు పరిస్థితి చూడు..

- చినుకు పడితే చిత్తడే... చిన్న ఎల్కిచర్ల రహదారి దుస్థితి
- వెంటనే బీటీ రోడ్డు నిర్మించి ప్రజల కష్టాలు తీర్చాలి
- బీజేపీ సీనియర్ నాయకుడు గోపి నర్సింలు



**ఆదాబ్ సైబరాబాద్, షాద్‌నగర్ :** కొందుర్గు మండలం చిన్న ఎల్కిచర్ల గ్రామానికి శ్రీరంగాపూర్ నుంచి వెళ్లే ప్రధాన రహదారి పూర్తిగా గుంతలమయంగా మారి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీజేపీ సీనియర్ నాయకుడు గోపి నర్సింలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వర్షాకాలంలో స్వల్పంగా చినుకు పడినా రహదారి మొత్తం బురదమయంగా మారి వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోందన్నారు. గ్రామానికి వచ్చే స్కూల్ బస్సులు, అత్యవసర సేవల వాహనాలు, ఇతర రవాణా వాహనాలు కూడా ఈ రహదారిపై ప్రయాణించలేని పరిస్థితి ఏర్పడిందని తెలిపారు.
చిన్న ఎల్కిచర్ల మీదుగా ప్రయాణించే ప్రజలతో పాటు గ్రామస్థులు నిత్యం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. వెంటనే ఈ రహదారిని పునరుద్ధరించి నాణ్యమైన బీటీ రోడ్డు నిర్మించాలని ప్రభుత్వాన్ని కోరారు. అలాగే గ్రామ పరిసర ప్రాంతాల్లో ఉన్న పరిశ్రమలు, కంపెనీలు కూడా తమ సామాజిక బాధ్యత (జూ=)లో భాగంగా రహదారి అభివృద్ధికి సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. రహదారిని త్వరితగతిన అభివృద్ధి చేస్తే భవిష్యత్తులో ప్రమాదాలను నివారించడంతో పాటు ప్రజలకు సురక్షితమైన రవాణా సౌకర్యం అందుబాటులోకి వస్తుందని గోపి నర్సింలు పేర్కొన్నారు.

## హైదరాబాద్‌లో 11వ అఖిల భారత పోలీస్ జూడో క్లస్టర్-2026

- పాల్గొన్న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ శ్రీకారం
- పోలీస్ క్రీడలు జాతీయ సమైక్యతను బలోపేతం చేస్తాయి..
- 36 రాష్ట్ర పోలీసు, జూగ్రాఫీ బృందాల నుంచి 1,600 మంది క్రీడాకారుల భాగస్వామ్యం



**ఆదాబ్ సైబరాబాద్, హైదరాబాద్ :** కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం ఆధ్వర్యంలో హైదరాబాద్ గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి ఇండోర్ స్టేడియంలో నిర్వహిస్తున్న 11వ అఖిల భారత పోలీస్ జూడో క్లస్టర్-2026 క్రీడా పోటీలను కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, క్రీడలు దేశ నిర్మాణానికి, యువత అభివృద్ధికి కీలక సాధనమని పేర్కొన్నారు. ఖేలో ఇండియా, ఆసియా క్రీడలు, వరల్డ్ పోలీస్ అండ్ ఫైర్ గేమ్స్ వంటి కార్యక్రమాల ద్వారా కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా క్రీడా మౌలిక వసతులను విస్తరించిందని తెలిపారు. క్రీడల కోసం కేంద్ర బడ్జెట్‌ను రూ.4,480 కోట్లకు పెంచడం ద్వారా ప్రభుత్వం క్రీడల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. భారత్ 2047 నాటికి ప్రపంచంలో అగ్ర ఐదు క్రీడా దేశాల్లో ఒకటిగా నిలవాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతోందని బండి సంజయ్ తెలిపారు. ఇటువంటి పోలీస్ క్రీడా పోటీలు దేశంలోని వివిధ రాష్ట్రాల పోలీసు సిబ్బందిని ఒకే వేదికపైకి తీసుకువచ్చి సోదరభావం, పరస్పర అవగాహన, జాతీయ సమైక్యతను మరింత బలోపేతం చేస్తాయని అన్నారు. పోలీసు క్రీడల్లో మహిళల భాగస్వామ్యం పెరుగుతుండటం సంతోషకరమని, ఇది మహిళా సాధికారతకు నిదర్శనమని పేర్కొన్నారు. ఈ పోటీలు కేవలం పతకాల కోసమే కాకుండా, దేశ భద్రత కోసం నిరంతరం సేవలందించే పోలీసు, భద్రతా దళాల సిబ్బందికి శారీరక దృఢత్వం, క్రమశిక్షణ, మానసిక సామర్థ్యాన్ని పెంపొందించే వేదికగా నిలుస్తాయని చెప్పారు. 1969 నుంచి సీఐఎస్ఎఫ్ దేశంలోని విమానాశ్రయాలు, ఢిల్లీ మెట్రో, అణు, అంతరిక్ష కేంద్రాలు, పార్లమెంట్ భవనం సహా కీలక మౌలిక సదుపా యాలకు భద్రత కల్పిస్తోందని ఆయన గుర్తుచేశారు. ఇటీవల సీఐ ఎస్ఎఫ్ హెడ్ కానిస్టేబుల్ అభిమన్యు ఆసియా రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో స్వర్ణ పతకం సాధించి ప్రపంచ రెజ్లింగ్ ర్యాంకింగ్స్‌లో మూడో స్థానానికి చేరుకోవడం గర్వకారణమని కొనియాడారు.
క్రీడాకారుల సంక్షేమానికి సీఐఎస్ఎఫ్ తీసుకుంటున్న చర్యలు అభినందనీయమని, నాణ్యమైన పోషకాహారం, ఆధునిక క్రీడా పరికరాలు, గాయాల నుంచి త్వరగా కోలుకునేందుకు ప్రత్యేక ఆర్థిక సహాయం అందించడం ద్వారా మరిన్ని అంతర్జాతీయ విజయాలు సాధించే అవకాశం కలుగుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీఐఎస్ఎఫ్ దక్షిణ విభాగం అదనపు డీజీ పద్మాకర్ ఎస్. రన్‌పిసే, ఐజీ ఎస్.ఆర్. శరవణన్, ఐజీ హర్ప్రీత్ కౌర్ సోహి, నీసా డైరెక్టర్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. జూలై 23 నుంచి 30 వరకు జరుగుతున్న ఈ ఛాంపియన్‌షిప్‌లో దేశవ్యాప్తంగా 36 రాష్ట్ర పోలీసు విభాగాలు, కేంద్ర సాయుధ పోలీసు బలగాల నుంచి 1,600 మందికి పైగా క్రీడాకారులు పాల్గొంటున్నారు. జూడో, వుషూ, తైక్వాండో, కరాటే, పెంకాక్ సిలాట్ విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నారు.

## డంపింగ్ యార్డు ఎత్తివేతకు ఉద్యమం ఉధృతం



- భవిష్యత్ కార్యాచరణపై పోరాట కమిటీ నిర్ణయం

**ఆదాబ్ సైబరాబాద్, జవహర్‌నగర్ :** జవహర్‌నగర్ డంపింగ్ యార్డును శాస్త్రీయ పద్ధతిలో మూసివేసి, శాశ్వతంగా ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ జవహర్‌నగర్ డంపింగ్ యార్డు ఎత్తివేత పోరాట కమిటీ భవిష్యత్ కార్యాచరణకు శ్రీకారం చుట్టింది. కీసర సర్కిల్‌లోని నీలం రాంచంద్రయ్య భవన్‌లో గురువారం జరిగిన కో-కన్వీనర్ల సమావేశంలో ఉద్యమాన్ని మరింత విస్తృతం చేయాలని నిర్ణయించారు.
కమిటీ చైర్మన్ షేక్ షావలి, కన్వీనర్ ఉమా మహేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఇటీవల నిర్వహించిన డంపింగ్ యార్డు సదస్సును సమీక్షించారు. సమస్య తీవ్రతను వివరించేందుకు ఎంపీ ఈటెల రాజేందర్, స్థానిక ఎమ్మెల్యేలు, మాజీ కార్పొరేటర్లను కలిసి వినతిపత్రాలు అందజేయాలని నిర్ణయించారు.
డంపింగ్ యార్డు ప్రభావిత గ్రామాలు, కాలనీల్లో అఖిలపక్ష కమిటీల ఏర్పాటు, దమ్మాయిగూడ యాంటీ డంపింగ్ యార్డు జేఏసీతో కలిసి సంయుక్త ఉద్యమాలు చేపట్టాలని తీర్మానించారు. ప్రజలు, రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలన్నింటినీ కలుపుకొని డంపింగ్ యార్డు శాశ్వత ఎత్తివేత వరకు ఎడతెగని పోరాటం కొనసాగిస్తామని కమిటీ
నాయకులు స్పష్టం చేశారు.

## లోధా మెరిడియన్ అపార్ట్‌మెంట్‌లో పేకాట స్థావరంపై కేపీహెచ్‌బీ పోలీసుల దాడి

- ఇద్దరు మహిళలు సహా ఏడుగురు అరెస్ట్..
- రూ.1.42 లక్షల నగదు, 40 పేకముక్కల సెట్లు స్వాధీనం




**ఆదాబ్ సైబరాబాద్, కేపీహెచ్‌బీ:** కేపీహెచ్‌బీ కాలనీలోని లోధా మెరిడియన్ అపార్ట్‌మెంట్‌లో ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తూ డబ్బులు పందెంగా పెట్టి పేకాట ఆడుతున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు కేపీహెచ్‌బీ పోలీసులు జూలై 29 సాయంత్రం ఆకస్మిక దాడి నిర్వహించారు. దాడిలో ఇద్దరు మహిళలు సహా మొత్తం ఏడుగురు పేకాట ఆడుతూ పట్టుబడ్డారు. వారిని అదుపులోకి తీసుకుని విచారించగా, వారి వివరాలు వెల్లడయ్యాయి. నిందితుల నుంచి మొత్తం రూ.1,42,080 నగదుతో పాటు 40 పేకముక్కల సెట్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై కేపీహెచ్‌బీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అరెస్టయిన నిందితులు: 1. వీరగంధం హేమలత(50) 2. బోయిని కిషోర్ కుమార్ (43) 3. బల్లేవాలే బల్వీర్ సింగ్ (45) 4. బల్లేవాలే బల్దేవ్ సింగ్ (72) 5. బల్లేవాలే అరుణ్ సింగ్ (51) 6. గోడేపూడి గీత (45) 7. భాస్కర్ బాలాజీ (38) ఈ కేసుకు దర్యాప్తు అధికారి డబ్ల్యూఎస్ఐ వి. మౌనికా రెడ్డి. పోలీసులు కేసు దర్యాప్తును కొనసాగిస్తున్నారు.

## శంకర్‌పల్లి మున్సిపల్ ఒకటవ వార్డు వెంకటేశ్వర కాలనీలో సమస్యల తీష్ట





- ప్రజల సమస్యలను తీర్చని స్థానిక కౌన్సిలర్ ఎర్రోళ్ల ఆనంద్ రావు సోషల్ మీడియాకే పరిమితం

**ఆదాబ్ సైబరాబాద్, శంకర్‌పల్లి:-** శంకర్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని ఒకటవ వార్డు వెంకటేశ్వర కాలనీలో సమస్యలు తిష్ట వేసినట్టు కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలనీలోని క్రిస్టల్ వెంచర్ లో నెలకొన్న దుర్గంధం వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని అండర్ డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో మురుగునీరు అంత కాలనీలో పారుతోందని ఆరోపించారు. కాలనీ రోడ్లపై పారుతున్న మురుగు నీరు కాలనీలోని ఇండ్లలోకి వస్తుందని తద్వారా వృద్ధులు, చిన్నా రులు తీవ్ర అనారోగ్యం బారిన పడుతున్నారన్నారు. ప్రజల సమస్యలను తీర్చని స్థానిక కౌన్సిలర్ ఎర్రోళ్ల ఆనంద్ రావు సోషల్ మీడి యాకే పరిమితం అని స్థానిక ప్రజలు గుసగుసలా డుకుంటున్నారు. పనుల మీద శ్రద్ధ చూపకుండా పలు పత్రికలలో పనులు చేసినట్లు వార్తలు రాపించుకుంటూ.. సోషల్ మీడియాను తెగ వాడుతున్నట్టు వార్డు ప్రజలకు అందరికీ తెలిసిన విషయమే అని ప్రజలు ఆరోపి స్తున్నారు. కాలనీవాసులు కౌన్సిలర్ ను అడగగా.. మీరు నాకు ఓటు వేయలేదని ముఖాముఖిగా అంటున్నట్టు వార్డు ప్రజలు తెలియజేశారు. ఈ విషయమై మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

# భారత్ యూకే అమల్లోకి

- హైదరాబాద్‌లో తెలంగాణ ఎగుమతి సరుకులకు శ్రీకారం



**ఆదాబ్ సైబరాబాద్, హైదరాబాద్ :** భారత్--యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే) మధ్య కుదిరిన సమగ్ర ఆర్థిక, వాణిజ్య ఒప్పందం అమల్లోకి వచ్చిన సందర్భంగా హైదరాబాద్‌లోని సనత్‌నగర్ ఇన్‌ల్యాండ్ కంటైనర్ డిపోలో తెలంగాణ నుంచి యూకేకు వెళ్లే ఎగుమతి సరుకులను బుధవారం అధికారికంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ పరిశ్రమలు, వాణిజ్య శాఖ ప్రత్యేక కార్యదర్శి కృష్ణ ఆదిత్య మాట్లాడుతూ, భారత్--యూకే ఆర్థిక సంబంధాల్లో ఈ ఒప్పందం కీలక మైలురాయిగా నిలుస్తుందన్నారు. అనేక ఉత్పత్తులపై దిగుమతి సుంకాలు తగ్గడంతో తెలంగాణ ఎగుమతిదారులకు యూకే మార్కెట్‌లో మరింత పోటీతత్వం లభించి, ఎగుమతి ఆధారిత పరిశ్రమలకు కొత్త అవకాశాలు ఏర్పడతాయని చెప్పారు.
విదేశీ వాణిజ్య డైరెక్టరేట్ (డీజీఎఫ్‌టీపీ) అదనపు డైరెక్టర్ జనరల్ డా. సంపత్ కుమార్ మాట్లాడుతూ, ఈ ఒప్పందం ద్వారా భారతీయ ఉత్పత్తులకు విస్తృత స్థాయిలో ప్రాధాన్య సుంకరాయితీలు లభిస్తాయని, తద్వారా యూకే మార్కెట్‌లో భారత ఎగుమతులు మరింత పెరిగే అవకాశముందని పేర్కొన్నారు.
జాతీయ పసుపు బోర్డు కార్యదర్శి భవాని శ్రీ మాట్లాడుతూ, ఈ ఒప్పందం ప్రయోజనాలు పెద్ద పరిశ్రమలతో పాటు సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు (ఎంఎస్ఎంఈలు) కూడా అందనున్నాయని తెలిపారు. తెలంగాణలోని ఔషధాలు, రసాయనాలు, ఎలక్ట్రానిక్స్, ఆహార ప్రాసెసింగ్ రంగాలు ఈ అవకాశాలను సమర్థంగా వినియోగించుకోగలవని అన్నారు.
ఏపీడీఏ తెలంగాణ--ఆంధ్రప్రదేశ్ ప్రాంతీయ అధికారి ఆర్.పీ. నాయుడు మాట్లాడుతూ, వ్యవసాయ ఉత్పత్తులు, ప్రాసెస్డ్ ఫుడ్స్, పాల ఉత్పత్తులు, మిల్లెట్స్, మిఠాయిల వంటి ఉత్పత్తుల ఎగుమతులకు ఈ ఒప్పందం గణనీయమైన ఊతమివ్వనుందని తెలిపారు. యూకే హైకమిషన్ ట్రేడ్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ విభాగాధిపతి సిద్ధార్థ్ విశ్వనాథన్ మాట్లాడుతూ, మార్కెట్ ప్రాప్యత పెరగడం, కస్టమ్స్ ప్రక్రియలు సరళీకృతం కావడం, డాక్యుమెంటేషన్ సులభతరం కావడం వల్ల భారత్--యూకే ద్వైపాక్షిక వాణిజ్యం, పెట్టుబడులు మరింత బలోపేతం అవుతాయని అన్నారు. 2025--26 ఆర్థిక సంవత్సరంలో తెలంగాణ నుంచి యూకేకు సుమారు 402.5 మిలియన్ అమెరికన్ డాలర్ల విలువైన ఎగుమతులు నమోదయ్యాయి. ఔషధాలు, బయోలాజికల్స్, ఎలక్ట్రానిక్ పరికరాలు, విద్యుత్ యంత్రాలు, రసాయనాలు, ఇంజినీరింగ్ ఉత్పత్తులు, వైద్య పరికరాలు ప్రధాన ఎగుమతి వస్తువులుగా ఉన్నాయి. ఈ ఒప్పందం అమలుతో ఔషధాలు, లైఫ్ సైన్సెస్, ఎలక్ట్రానిక్స్, ఇంజినీరింగ్, రసాయనాలు, ఆహార ప్రాసెసింగ్, వ్యవసాయ రంగాలకు విశేష ప్రయోజనం చేకూరనుంది. అలాగే ఎంఎస్ఎంఈల భాగస్వామ్యం పెరగడంతో పాటు ఎగుమతి ఆధారిత తయారీ రంగంలో పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు కూడా విస్తరించనున్నాయని అధికారులు తెలిపారు. ఒప్పందం అమల్లోకి వచ్చిన సందర్భంగా నిజామాబాద్‌లో జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి శ్రీ గజానన్ ఇండస్ట్రీస్‌కు చెందిన బియ్యం ఎగుమతి సరుకులను ప్రారంభించగా, హైదరాబాద్‌లో డీజీఎఫ్‌టీపీ సంయుక్త డైరెక్టర్ జనరల్ సంభాజీ చవాన్ ఫుమార్ అగ్రి ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన ఆహార ఉత్పత్తుల ఎగుమతి సరుకులను జెండా ఊపి ప్రారంభించారు. సనత్‌నగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉన్నతాధికారులు, కస్టమ్స్, ఏపీడీఏ, ఎగుమతుల ప్రోత్సాహక సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

## తెలంగాణలో ఏప్రిల్ 26 నుంచి జనగణన-2027

- స్వీయ నమోదు ప్రక్రియ ప్రారంభం
- మే 10 వరకు అవకాశం
- దేశంలోనే తొలి పూర్తిస్థాయి డిజిటల్ జనగణన
- తెలంగాణ జనగణన డైరెక్టర్ భారతి హొల్లికేరి స్పష్టం



**ఆదాబ్ సైబరాబాద్, హైదరాబాద్ :** జనగణన-2027లో భాగంగా తెలంగాణ రాష్ట్రంలో ఏప్రిల్ 26 నుంచి మే 10 వరకు స్వీయ నమోదు (సెల్ఫ్ ఎన్యూమరేషన్) ప్రక్రియ నిర్వహిం చనున్నట్లు తెలంగాణ జనగణన సంచాలకురాలు భారతి హొల్లికేరి తెలిపారు. హైదరాబాద్‌లోని జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యా లయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె ఈ వివరాలను వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత నిర్వహిస్తున్న తొలి జనగణన ఇదేనని, అలాగే దేశంలో తొలి పూర్తిస్థాయి డిజిటల్ జనగణన కూడా ఇదేనని ఆమె పేర్కొన్నారు. స్వాతంత్ర్యం అనంతరం తొలిసారిగా కుల ప్రాతిపదికన వివరాలు కూడా సేకరించనున్నందున ఈ జనగణనకు ప్రత్యేక ప్రాధాన్యం ఏర్పడిందన్నారు. మొట్టమొదటిసారిగా స్వీయ నమోదు సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకొచ్చామని, ప్రజలు స్వచ్ఛందంగా అధికారిక వెబ్ పోర్టల్ ద్వారా తమ వివరాలను నమోదు చేసుకోవచ్చని తెలిపారు. అయితే ఇది తప్పనిసరి కాదని, ప్రజల సౌకర్యం కోసం మాత్రమే ఈ విధానాన్ని ప్రవేశపెట్టినట్లు స్పష్టం చేశారు. స్వీయ నమోదు ద్వారా సమాచార సేకరణ వేగవంతం కావడంతో పాటు క్షేత్రస్థాయిలో పనిచేసే ఎన్యూమరేటర్లపై పని భారం కూడా తగ్గుతుందని చెప్పారు. తెలుగు, హిందీ, ఆంగ్లం సహా 16 భాషల్లో అందుబాటులో ఉన్న ఈ పోర్టల్ అత్యంత భద్రతా ప్రమాణాలతో రూపొం దించ బడిందని తెలిపారు. జనగణనలో మొత్తం 33 ప్రశ్నలు ఉండగా, అందులో 27 ప్రశ్నలకు ప్రజలు స్వయంగా సమాధానాలు నమోదు చేయవచ్చని చెప్పారు. మిగిలిన ఆరు ప్రశ్నలను ఎన్యూమరేటర్లు ఇంటింటికి వెళ్లి పూర్తి చేస్తారని వివరించారు. ఎలాంటి పత్రాలు లేదా ఫోటోలు అప్‌లోడ్ చేయాల్సిన అవసరం లేదని, జియో ఫెన్సింగ్ లేకపోవడంతో ప్రపంచంలో ఎక్కడి నుంచైనా వివరాలను నమోదు చేయవచ్చని పేర్కొన్నారు.
జనగణనను అన్ని సర్వేలకు మాతృకగా అభివర్ణించిన భారతి హొల్లికేరి, ప్రభుత్వ విధానాల రూపకల్పన, అభివృద్ధి ప్రణాళికల తయారీలో జనగణన గణాంకాలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. ప్రజలు ఖచ్చితమైన సమాచారాన్ని అందించడం తమ బాధ్యతగా భావించాలని, భావితరాల అభివృద్ధికి ఇది ఎంతో ఉపయోగపడుతుందని ఆమె విజ్ఞప్తి చేశారు. గ్రేటర్ హైదరాబాద్, కోర్ అర్బన్ రీజియన్ పరిధిలో జనగణన ఏర్పాట్లపై జీహెచ ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ వివరించారు. ప్రతి డివిజన్‌ను ఒక యూనిట్‌గా తీసుకుని జనగణన నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందుకోసం 21,866 మంది ఎన్యూమరేటర్లు, 3,652 మంది సూపర్‌వైజర్లు, 60 మంది డిప్యూటీ కమిషనర్లను నియమించినట్లు చెప్పారు. కంటోన్మెంట్ ప్రాంతానికి ప్రత్యేక ఇన్‌ఛార్జి అధికారిని నియమించనున్నట్లు వెల్లడించారు. ప్రజలు స్వీయ నమోదు ప్రక్రియలో చురుకుగా పాల్గొనాలని ఆయన కోరారు. విలేకరుల సమావేశం అనంతరం జనగణన-2027కు సంబం

## పూరిగుడిసెలు లేని తెలంగాణయే లక్ష్యం

- అన్నపురెడ్డిపల్లిలో రూ.2.77 కోట్ల అభివృద్ధి పనులకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శంకుస్థాపన



**ఆదాబ్ సైబరాబాద్, ఖమ్మం :** ప్రజా సంక్షేమమే పరమావధిగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని, తెలంగాణలో పూరిగుడిసెలు లేని పేదరికరహిత సమాజాన్ని నిర్మించడమే ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రధాన సంకల్పమని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. గురువారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అన్నపురెడ్డిపల్లి మండలంలో ఆయన విస్తృతంగా పర్యటించారు. ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, కలెక్టర్ అంకిత్‌లతో కలిసి రూ.2.77 కోట్లకు పైగా అంచనా వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు.

**- మౌలిక వసతుల కల్పనకు రూ.2.77 కోట్లు**

గ్రామీణ ప్రాంతాల సమగ్ర వికాసానికి, మౌలిక సదుపాయాల కల్పనకు తమ ప్రభుత్వం అత్యున్నత ప్రాధాన్యమిస్తోందని మంత్రి పేర్కొన్నారు. పర్యటనలో భాగంగా గుంపెన గ్రామంలో రూ.45 లక్షలతో 9 అంతర్గత సీసీ రోడ్ల పనులకు, నరసాపురంలో ఉపాధి హామీ నిధులు రూ.117.30 లక్షలతో సీసీ రోడ్లు మరియు కల్వర్టుల నిర్మాణానికి భూమిపూజ చేశారు. భీమునిగూడెంలో రూ.20 లక్షలతో నిర్మించిన నూతన గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభించిన ఆయన, కోండాయిగూడెం డబుల్ బెడ్‌రూమ్ కాల నీలో రూ.20 లక్షలతో, పెద్దిరెడ్డిగూడెంలో రూ.75.50 లక్షలతో చేపట్టే రహదారుల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.

**-ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఇంట గృహప్రవేశాల కోలాహలం.**

అనంతరం మండలంలోని పలు గ్రామాల్లో నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల గృహప్రవేశ మహోత్సవాల్లో మంత్రి స్వయంగా పాల్గొన్నారు. పెద్దిరెడ్డిగూడెంలో అగ్గి రాజమ్మ, గుంపెనలో మాయారా వసంత, భీమునిగూడెంలో వాడే సుజాత, నరసాపురంలో తిరుమలదేవి అనిత, చీపుడు జ్యోతి, ఊటుపల్లిలో మొల్లచవుకు కవిత, రంగాపురంలో వేముల కృష్ణయ్య, పెనుగొండ కోటమ్మల నూతన గృహాల్లో అడుగుపెట్టి వారికి శుభాకాంక్షలు అందజేశారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందుతాయని, అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ,
నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

**-వారంలోగా సీతారామ నిర్వాసితుల సమస్యల పరిష్కారం.**

ప్రాజెక్టు భూనిర్వాసితుల సమస్యలపై స్పందించిన మంత్రి పొంగులేటి, సీతారామ ప్రాజెక్టు బాధితుల సమస్యలను ప్రాధాన్యతతో పరిశీలించి వారం రోజుల్లోగా పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, కొత్తగూడెం ఆర్డీవో మధు, హౌసింగ్ పీడీ, జిల్లా పంచాయతీ అధికారి అనూష, తాసిల్దార్, ఇతర

# ఆగస్టు 15 వేడుకల సందర్భంగా టి.ఎం.ఎస్.ఆర్.యు ఖమ్మం సబ్ యూనిట్ ఆధ్వర్యంలో షటిల్, క్యారమ్స్ టోర్నీలు

ఆదాబ్ సైబరాబాద్, ఖమ్మం :స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని టి.ఎం.ఎస్.ఆర్.యు ఖమ్మం సబ్ యూనిట్ ఆధ్వర్యంలో ఆగస్టు 1, 2 తేదీల్లో షటిల్ డబుల్స్, క్యారమ్స్ డబుల్స్ టోర్నమెంట్లు నిర్వహించనున్నట్లు, అధ్యక్షులు పేరాల సంపత్ మరియు నిర్వాహకులు తెలిపారు.

క్రీడా స్ఫూర్తిని పెంపొందించడం, సభ్యుల మధ్య స్నేహభావాన్ని బలోపేతం చేయడం లక్ష్యంగా ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.పోటీల్లో పాల్గొనదలచిన క్రీడాకారులు జూలై 31లోపు తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. క్యారమ్స్ డబుల్స్ పోటీలకు రిజిస్ట్రేషన్ ఫీజు రూ.300, షటిల్ డబుల్స్ పోటీలకు రూ.500గా నిర్ణయించినట్లు తెలిపారు. రెండు విభాగాల్లోనూ ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన జట్లకు మెమెంటో, షీల్డ్‌తో పాటు నగదు బహుమతులు అందజేయనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.

షటిల్ డబుల్స్ టోర్నీలో పాల్గొనేవారు ఎం.ఉపేందర్, షాజీ, శ్రీనివాస్ రెడ్డి (కొరోనా), శ్రీహరి, పార్థసారథి, రాఘవ, చైతన్యలను సంప్రదించవచ్చు. అలాగే క్యారమ్స్ డబుల్స్ పోటీలకు అశోక్, నాయెమ్, కృష్ణ, సురేష్, ప్రవీణ్, రాజు, బానుప్రకాశ్ లను సంప్రదించాలని సూచించారు.

గమనిక: ఈ పోటీల్లో ఖమ్మం రిప్రజెంటేటివ్స్ మాత్రమే పాల్గొనడానికి అర్హులని నిర్వాహకులు స్పష్టం చేశారు.

# అదనపు కట్న వేధింపుల కేసులో భర్తకు యావజ్జీవ కఠిన కారాగార శిక్ష,

**– కీసర పోలీసుల సమర్థ దర్యాప్తుతో ఏడు సంవత్సరాల అనంతరం న్యాయంరూ.10 వేల జరిమానా విధించిన న్యాయస్థానం,**




ఆదాబ్ సైబరాబాద్, కీసర : కీసర పోలీస్ స్టేషన్‌లో 2019లో నమోదైన అదనపు కట్న వేధింపులు, అనుమానాస్పద మృతి కేసులో నిందితుడికి యావజ్జీవ కఠిన కారాగార శిక్ష విధిస్తూ మేడ్చల్–-మల్కాజిగిరి జిల్లా కుషాయిగూడలోని ప్రధాన జిల్లా మరియు సెషన్స్ న్యాయస్థానం గురువారం తీర్పు వెలువరించింది.పోలీసుల వివరాల ప్రకారం, 08 ఆగస్టు 2019న కీసర పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నెం.367/2019గా సెక్షన్ 304-బి ఐపీసీ కింద కేసు నమోదైంది. వివాహానంతరం అదనపు కట్నం కోసం భార్య శ్రావణిని శారీరకంగా, మానసికంగా వేధింపులకు గురిచేయడంతో పాటు ఆమె అనుమానాస్పద మృతికి కారణమైన ట్లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.దర్యాప్తులో సేకరించిన బలమైన సాక్ష్యాధారాలను న్యాయస్థా నంలో సమర్పించగా, ఎస్.సి. నెం.79/2021లో విచారణ పూర్తయింది. గురువారం గౌరవ ప్రధాన జిల్లా మరియు సెషన్స్ న్యాయమూర్తి శ్రీ బాలభాస్కర్ తీర్పు వెలువరిస్తూ, రాజ్‌సుఖ్ నగర్ కాలనీ, నాగారం, కీసర మండలానికి చెందిన కుంచాల రామాంజనేయులు (32)ను దోషిగా నిర్ధారించి యావజ్జీవ కఠిన కారాగార శిక్షతో పాటు రూ.10,000 జరిమానా విధించారు.ఈ కేసును అప్పటి ఏసీపీ కె. శివకుమార్ (ప్రస్తుతం అదనపు డీసీపీ–-అడ్మిన్, మల్కాజిగిరి కమిషనరేట్) సమర్థవంతంగా దర్యాప్తు చేసి, నిందితుడికి శిక్ష పడేలా కీలక సాక్ష్యాధారాలను న్యాయస్థానం ముందు ప్రవేశపెట్టారు.కేసు విచారణలో అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ డేవిడ్ రాబర్ట్సన్, కోర్టు కానిస్టేబుల్ రవితేజ, సమన్స్ అధికారి డి. భాస్కర్, లైజన్ అధికారి పి.డి. దివిరాజు, మానిటరింగ్ అధికారి పి. నరసింహారెడ్డి సమన్వయంతో పనిచేశారు.

ఈ కేసులో నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన దర్యాప్తు అధికారి, ప్రాసిక్యూషన్ బృందం మరియు సహకరించిన పోలీసు సిబ్బందిని మల్కాజిగిరి డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (డీసీపీ) సి.హెచ్. శ్రీధర్, ఐపీఎస్ అభినందించారు.


# నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు

హైదరాబాద్, జులై 30: గణేశ్ విగ్రహాల గరిష్ట ఎత్తు 16 అడుగులకు పరిమితం చేయాలని తయారీదారులను హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ ఆదేశించారు. వినాయక చవితి సమీపిస్తుంది. ఈ నేపథ్యంలో విగ్రహాల తయారీ దశ నుంచే భద్రతా నిబంధనలు కచ్చితంగా పాటించాలని వారికి స్పష్టం చేశారు. గణేశ్ ఉత్సవాలపై హైదరాబాద్ పోలీసులు ముందస్తు సన్నాహాలు చేస్తున్నారు. అందుకోసం గురువారం నగర సీపీ వీసీ సజ్జనర్ అధ్యక్షతన విగ్రహ తయారీదారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.ప్రశాంతంగా, సురక్షితంగా, పర్యావరణహితంగా ఉత్సవాలు నిర్వహించడమే లక్ష్యమని ఈ సందర్భంగా వారికి సీపీ స్పష్టం చేశారు. గతేడాది హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో దాదాపు 23 వేల గణేశ్ విగ్రహాలను ప్రతిష్టించినట్లు వివరించారు.విగ్రహాల రవాణా సమయంలో గతేడాది నాలుగు ప్రమాదాలు జరిగాయని నగర సీపీ గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో జాగ్రత్తలు తప్పని సరి అని వారికి సూచించారు. మట్టి విగ్రహాలను ప్రోత్సహించాలని తయారీదారులను కోరారు. చిన్న విగ్రహాల ప్రతిష్టాపనపై భక్తులకు అవగాహన కల్పించాలని వివరించారు. విగ్రహాల తయారీ కేంద్రాల్లో ఫైర్ సేఫ్టీ, సురక్షితమైన విద్యుత్ వైరింగ్ నిబంధనను తప్పనిసరిగా అమలు చేయాలని ఆదేశించారు.



# యాంటీ బయాటిక్స్ మందులను వాడుతున్న వారు ఈ జాగ్రత్తలను పాటించడం తప్పనిసరి..

యాంటీ బయాటిక్స్ బ్యాక్టీరియా వల్ల వచ్చే ఇన్‌ఫెక్షన్లను నియంత్రించడంలో కీలక పాత్ర పోషిస్తాయి. అయితే ఈ మందులు తీసుకునే సమయంలో ఆహారంపై కూడా ప్రత్యేక శ్రద్ధ అవసరం. సరైన ఆహారాన్ని తీసుకోకపోతే మందుల ప్రభావం తగ్గడమే కాకుండా విరేచనాలు, జీర్ణాశయ అసౌకర్యం వంటి దుష్ప్రభావాలు కూడా పెరిగే అవకాశం ఉంది. అందుకే యాంటీ బయాటిక్స్ వాడుతున్నప్పుడు ఏ ఆహారాలు తీసుకోవాలి, వేటిని నివారించాలి అనే విషయాన్ని తెలుసుకోవడం చాలా ముఖ్యం. యాంటీ బయాటిక్స్ ను వాడే సమయంలో శరీరంలోని మంచి బ్యాక్టీరియా కూడా కొంత మేర దెబ్బతింటుంది. దీంతో విరేచనాలు వంటి సమస్యలు వస్తాయి. ఈ పరిస్థితిలో ప్రోబయోటిక్స్ అధికంగా ఉండే పెరుగు వంటి ఆహారాలను తీసుకోవడం వల్ల పేగుల్లో మంచి బ్యాక్టీరియా తిరిగి పెరగడానికి సహాయపడుతుంది. జీర్ణవ్యవస్థ త్వరగా కోలుకోవడంలో కూడా ఇవి ఉపయోగపడతాయి.విటమిన్ కె తగ్గే చాన్స్..చాలా రోజుల పాటు యాంటీ బయాటిక్స్ తీసుకోవాల్సి వస్తే శరీరంలో విటమిన్ కె స్థాయిలు తగ్గే అవకాశం ఉంటుంది. అందువల్ల ఆకుకూరలు, ఆస్పరాగస్, గ్రీన్ టీ, బీఫ్ లివర్ వంటి విటమిన్ కె అధికంగా ఉండే ఆహారాలను తీసుకోవడం మంచిది. అవసరమైతే వైద్యుల సలహాతో విటమిన్ కె సప్లిమెంట్లను కూడా తీసుకోవచ్చు. యాంటీ బయాటిక్స్ వల్ల కొన్నిసార్లు ఈస్ట్ పెరుగుదల ఎక్కువై ఈస్ట్ ఇన్‌ఫెక్షన్లు లేదా జీర్ణాశయ అసౌకర్యం



ఏర్పడే అవకాశం ఉంటుంది. అలాంటి సమయంలో ఉల్లిపాయ, వెల్లుల్లి వంటి ఆహారాలు కొంత ఉపశమనం కలిగిస్తాయి. అలాగే ఈ మందుల వల్ల విటమిన్ బి స్థాయిలు కూడా తగ్గే అవకాశం ఉండటంతో బ్రోకోలీ వంటి ఆకుపచ్చ కూరగాయలను ఆహారంలో చేర్చడం ప్రయోజనకరం. యాంటీ బయాటిక్స్ తీసుకునే సమయంలో కొన్ని ఆహారాలను వీలైనంత వరకు దూరంగా ఉంచడం మంచిది. నిమ్మ, నారింజ, స్ట్రాబెర్రీ వంటి సిట్రిక్ యాసిడ్ అధికంగా ఉండే పండ్లు, టమాటో కెచప్, చాక్లెట్లు, శీతల పానీయాలు వంటి ఆమ్ల గుణాలు ఉన్న ఆహారాలు మందుల శోషణకు ఆటంకం కలిగించే అవకాశం ఉంటుంది. దీంతో యాంటీ బయాటిక్స్ ప్రభావం తగ్గుతుంది.

ఇవి యాంటీ బయాటిక్స్‌ను అడ్డుకుంటాయి..

పాలు, చీజ్ వంటి పాల ఉత్పత్తుల్లో ఉండే కాల్షియం కొన్ని యాంటీ బయాటిక్స్ శరీరంలో సరిగా శోషించకుండా చేస్తాయి. అయితే పెరుగు మాత్రం మినహాయింపు. ఇందులో ఉండే ప్రోబయోటిక్స్ పేగుల ఆరోగ్యాన్ని మెరుగుపరచి విరేచనాల ప్రమాదాన్ని తగ్గించడంలో సహాయపడతాయి. అలాగే ఐరన్ సప్లిమెంట్లు కూడా కొన్ని యాంటీ బయాటిక్స్ ప్రభావాన్ని తగ్గించే అవకాశం ఉ ండటంతో వాటిని ఒకేసారి తీసుకోవద్దని నిపుణులు సూచిస్తున్నారు. ధాన్యాలు, బీన్స్, పప్పుధాన్యాలు వంటి అధిక పీచు పదార్థాలు సాధారణంగా ఆరోగ్యానికి మంచివే. అయితే యాంటీబయాటిక్స్ తీసుకునే సమయంలో ఇవి ఆహారం జీర్ణమయ్యే వేగాన్ని తగ్గించి మందుల శోషణపై ప్రభావం చూపే అవకాశం ఉంటుంది. అందువల్ల మందులు వాడుతున్న రోజుల్లో వీటిని తీసుకునే సమయంపై వైద్యుల సూచనలు పాటించడం మంచిది. యాంటీబయాటిక్స్‌ను ఎప్పుడూ వైద్యుల సూచన మేరకే వాడాలి. మందులతో పాటు సరైన ఆహారాన్ని ఎంపిక చేసుకోవడం వల్ల చికిత్స మరింత ప్రభావవంతంగా ఉండటంతో పాటు దుష్ప్రభావాల ప్రమాదాన్ని కూడా తగ్గించుకోవచ్చు.

# మార్కెట్ అక్రమాలపై విచారణ కోరుతూ వినతి



ఆదాబ్ సైబరాబాద్, కుషాయిగూడ : కుషాయిగూడ కూరగాయల మార్కెట్‌లో షాపుల అక్రమ బదిలీలు, అనధికార వ్యాపారాలు, రైతుల వద్ద అక్రమ వసూళ్లు, కోట్ల రూపాయల అద్దె, విద్యుత్ బకాయిలపై విజిలెన్స్ విచారణ జరిపించాలని కుషాయిగూడ వెల్ఫేర్ అసోసియేషన్ కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌కు వినతిపత్రం అందజేసింది. అక్రమంగా బదిలీ అయిన షాపులను స్వాధీనం చేసుకోవడంతో పాటు ప్రభుత్వ ఆదాయ నష్టంపై సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరింది. ఈ కార్యక్రమంలో పనగట్ల చక్రపాణి గౌడ్, చల్లా ప్రభాకర్, కొడకండ్ల యాదయ్య వెంకటేశ్వర్లు, పండాల గణేష్ గౌడ్, దయానంద్,ద పిట్టల రాజు ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# ఫీజు బకాయిల విడుదలకు బీజేవైఎం సంతకాల సేకరణ



ఆదాబ్ సైబరాబాద్, ఉప్పల్: ఫీజు రీయింబర్స్‌మెంట్ పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీజేవైఎం ఆధ్వర్యంలో ఉప్పల్‌లోని ఒమేగా ఉమెన్స్ డిగ్రీ కళాశాలలో సిగ్నేచర్ క్యాంపెయిన్ నిర్వహించారు. విద్యార్థుల నుంచి పెద్ద ఎత్తున సంతకాల సేకరణ చేపట్టారు. కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా నాయకులు అరుణ్, శ్రీధర్, మహేశ్వర్, నవీన్ నాగపూరి పాల్గొన్నారు.

# వరద సమస్యకు శాశ్వత పరిష్కారమే లక్ష్యం

**– చర్లపల్లిలో రూ.6.88 కోట్ల అభివృద్ధి పనులకు మంత్రి శ్రీధర్ బాబు శంకుస్థాపన**



ఆదాబ్ సైబరాబాద్, చర్లపల్లి : చర్లపల్లి డివిజన్‌లో వరద నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లక్ష్యంగా రూ.6.39 కోట్లతో బాక్స్ డ్రెయిన్, రూ.49 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు గురువారం శంకుస్థాపన చేశారు. ఈసీ నగర్, బీఎన్ రెడ్డి నగర్, చిన్న చర్లపల్లి, జమ్మిగడ్డ, ద్వారకాపురి, రైల్ విహార్ ప్రాంతాల్లో చేపట్టనున్న బాక్స్ డ్రెయిన్ పనులతో వర్షాకాలంలో ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని మంత్రి తెలిపారు.కార్యక్రమంలో జిల్లా ఇంచార్జి తోటకూర వజ్రేష్ యాదవ్, ఉప్పల్ నియోజకవర్గ ఇంచార్జి మందుమూల పరమేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్సీ సెల్వరాజ్ శివమణి, కార్పొరేటర్ పావని రెడ్డి, ఎంఎంసీ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి, జోనల్ కమిషనర్ రాధిక గుప్తా, ఆర్డీవో వెంకట్ రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

# దివ్యాంగుడికేది సాయం..?

## ఓటరు నమోదుకు వచ్చినా పట్టించుకోని అధికారులు




ఆదాబ్ సైబరాబాద్, జవహర్‌నగర్ : ఓటరు జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా ఓటరు నమోదు కోసం గ్రామ పరిపాలన కార్యాలయానికి వచ్చిన ఓ దివ్యాంగుడు తీవ్ర అవస్థలు పడిన ఘటన జవహర్‌నగర్‌లో చోటుచేసుకుంది. వికలాంగుల కాలనీకి చెందిన దివ్యాంగుడు కార్యాలయానికి స్వయంగా వచ్చి నేలపై కూర్చొని ఇబ్బందులు పడుతున్నా అధికారులు, బీఎల్‌వోలు తగిన సహాయం అందించలేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.ఇంటింటికి వెళ్లి ఓటరు నమోదు చేయాల్సిన బీఎల్‌వోలు తమ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తి ంచడం లేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దివ్యాంగులకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించి, ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# తోట రూపేందర్ రెడ్డి బీఆర్ఎస్‌లో చేరిక



ఆదాబ్ సైబరాబాద్, మల్కాజ్‌గిరి : కౌకూర్‌కు చెందిన తోట రూపేందర్ రెడ్డి మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి సమక్షంలో గురువారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే పార్టీ కండువా కప్పి ఆయనను పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీ బలోపేతానికి సమిష్టిగా కృషి చేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జేఏసీ వెంకన్న, అనిల్ కిషోర్ గౌడ్, రాజు యాదవ్, శ్రీధర్ గౌడ్, సురేష్, జనార్ధన్, శ్రీకాంత్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# బంగారు మైసమ్మ ఆలయ అభివృద్ధికి సమష్టి కృషి

**– సమస్యల పరిష్కారానికి ముందుండి పనిచేస్తా,**
**– ఆలయ ప్రధాన కార్యదర్శి కుంటోళ్ల సత్యనారాయణ,**



ఆదాబ్ సైబరాబాద్, కీసర : కీసర గ్రామంలోని శ్రీ బంగారు మైసమ్మ తల్లి దేవాలయం పరిసరాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను నిరంతరం పర్యవేక్షిస్తూ, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని ఆలయ ప్రధాన కార్యదర్శి కుంటోళ్ల సత్యనారాయణ తెలిపారు.దేవాలయం చుట్టూ చేపడుతున్న పనుల్లో ఏవైనా సమస్యలు లేదా లోపాలు గుర్తించి వెంటనే స్థానిక ప్రజలు, ఆలయ కమిటీ సభ్యులు, సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసి వాటిని త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.దేవాలయ అభివృద్ధి, పరిశుభ్రత, భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పన తమ ప్రధాన లక్ష్యమని ఆయన అన్నారు. ఈ విషయంలో గ్రామ ప్రజలు, భక్తులు సహకరించాలని కోరారు. అందరి సహకారంతో శ్రీ బంగారు మైసమ్మ తల్లి ఆలయాన్ని మరింత అభివృద్ధి చేసి ఆదర్శ దేవాలయంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని స్పష్టం చేశారు..

శుక్రవారం, జూలై 31, 2026
TGTEL/26/A4985
ఆదాబ్ సైబరాబాద్
ADAAB CYBERABAD



# ఏకధాటిగా వర్షాలు ఓపెన్ కాస్ట్ గనుల్లోకి చేరిన వరద నీరు సింగరేణిలో బొగ్గు ఉత్పత్తికి బ్రేక్



పెద్దపల్లి జిల్లా: రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో రెండు రోజుల నుంచి ఏకధాటిగా వర్షాలు కురుస్తున్నాయి. ఫలితంగా సింగరేణి సంస్థ నాలుగు ఉపరితల గనుల్లో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం ఏర్పడింది. 4 ఉపరితల గనుల్లో రోజుకు వంద టన్నుల మేర బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయింది. ఉపరితల గనుల్లో భారీగా వరద చేరడంతో భారీ యంత్రాలు యార్డుకే పరిమితమయ్యాయి. మంచిర్యాల, కుమురం భీం జిల్లాల్లోని ఓపెన్ కాస్ట్ గనుల్లో కురుస్తున్న వర్షాల కారణంగా బొగ్గు ఉత్పత్తికి అంతరాయం కలిగింది. మంగళవారం రాత్రి నుంచి బుధవారం వరకు కురిసిన ఎడతెరిపి లేని వర్షాల వల్ల ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టుల్లోకి భారీగా వరద నీరు వచ్చి చేరింది. దీనివల్ల మట్టిని తొలగించే పనులు, బొగ్గు ఉత్పత్తి రెండూ నిలిచిపోయాయి. గనులకు వెళ్లే దారులు బురదమయంగా మారి, రవాణాకు ఆటంకం ఏర్పడింది. షవల్స్, డంపర్లు సహా ఇతర భారీ యంత్రాలు యార్డులకే పరిమితమయ్యాయి. వేల టన్నుల బొగ్గు ఉత్పత్తికి అంతరాయం : ఈ రెండు జిల్లాల్లోని మూడు ప్రాంతాల్లో మొత్తం ఐదు ఉపరితల గనులు ఉన్నాయి. బుధవారం ఉత్పత్తి పూర్తిగా నిలిచిపోవడంతో సుమారు 29,000 టన్నుల బొగ్గు ఉత్పత్తికి నష్టం వాటిల్లింది. శ్రీరాంపూర్ ప్రాంతంలో 15,220 టన్నులు, బెల్లంపల్లిలో 7,400 టన్నులు, మందమర్రి ప్రాంతంలో 6,407 టన్నుల మేర ఉత్పత్తి నిలిచిపోయింది. గనుల నుంచి కొత్తగా బొగ్గును వెలికితీసే పనులు నిలిచిపోయినప్పటికీ, డంప్ యార్డుల్లో ముందుగానే నిల్వ ఉంచిన బొగ్గును రవాణా చేయడానికి అధికారులు చర్యలు చేపట్టారు. నీటిని బయటకు పంపే ఏర్పాట్లు : ఉపరితల గనుల్లోని పని ప్రదేశాల్లో చేరిన వర్షపు నీటిని బయటకు పంపేందుకు అధికారులు ప్రయత్నాలు ప్రారంభించారు. వర్షాలు కొనసాగితే మరింత నీరు చేరే అవకాశం ఉందని భావించి, వారు ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. నీటిని నిరంతరాయంగా బయటకు పంపడానికి అధిక సామర్థ్యం గల మోటార్లను ఏర్పాటు చేశారు. వాహనాల రాకపోకలకు వీలుగా అంతర్గత రహదారులను సిద్ధం చేస్తున్నారు. అలాగే మట్టిని తొలగించే పనులు, బొగ్గు ఉత్పత్తిని వీలైనంత త్వరగా పునరుద్ధరించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఓపెన్ కాస్ట్ గనుల వద్ద ఉన్న పరిస్థితుల గురించి సంస్థ డైరెక్టర్ ఆయా ప్రాంతాల అధికారులతో మాట్లాడి ఆరా తీస్తున్నారు. భారీ వర్షాలతో బొగ్గు ఉత్పత్తికి ఆటంకం : పెద్దపల్లి జిల్లాలోని మంథని నియోజకవర్గంలో రెండు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీనితో జయశంకర్ భూపాలపల్లి జిల్లా మలహర్ రావు మండలం తాడిచెర్ల ఓసి 1 ఉపరితల బొగ్గు గనిలో భారీగా వర్షం నీరు చేరడంతో బొగ్గు ఉత్పత్తి పై తీవ్రంగా ప్రభావం పడింది. వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. సుమారు 20 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తి, 3 లక్షల పై చిలుకు మెట్రిక్ టన్నుల మట్టి తొలగింపు పనులు నిలిచిపోయాయి. అలాగే పెద్దపల్లి జిల్లా రామగిరి మండల పరిధిలోని ఆర్ జి త్రీ పరిధిలోని ఓసిపి 1, ఓసిపి 2లలో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయింది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు బొగ్గు ఉత్పత్తి పై ప్రభావం చూపాయి. ఓసిపి 1, 2 బొగ్గు బావుల్లో వర్షాలతో 18,000 టన్నుల ఉత్పత్తికి అంతరాయం ఏర్పడింది. విరామం లేకుండా కురుస్తున్న వర్షాలతో మొత్తం బురదమైయింది. మట్టి తవ్వకాలకు వర్షం ఆటంకం కలిగి స్తున్నది. ఓసి 1లో 5000 టన్నులు, ఓసీ 2లో 14000 టన్నుల మట్టి తవ్వకాలు నిలిచిపోయాయి.

## రెండు రోజులుగా వర్షాలు



హైదరాబాద్, జులై 30: తెలంగాణలో రెండు రోజులుగా విస్తారంగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ఆర్ అండ్ బీ అధికారులతో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలు, ఆర్ అండ్ బీ డివిజన్ల వారీగా రోడ్లు, బ్రిడ్జిలు, లో కాజ్‌వేలు, కల్వర్టుల వివరాలపై ఆరా తీశారు. ముంపు ప్రాంతాల్లో రాకపోకలకు ఇబ్బందులు లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. కల్వర్టులు, లో కాజ్‌వేలు, కోతకు గురైన రోడ్ల వద్ద ప్రమాద హెచ్చరిక బోర్డులు పెట్టాలన్నారు. అధికారులు అందరూ ఫీల్డ్‌లో ఉండాలని ఆదేశించారు. ఇప్పటికే నిర్మాణంలో ఉన్న రోడ్లు, బ్రిడ్జిల వద్ద తగు జాగ్రత్త చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు. క్షేత్రస్థాయిలో రెవెన్యూ, పోలీస్, విద్యుత్, ఇరిగేషన్ శాఖలతో సమన్వయం చేసుకోవాలన్నారు. ప్రతి రోజు ఫీల్డ్ రిపోర్ట్ తయారు చేయాలని, క్షేత్రస్థాయి ఇంజినీర్లతో మొబైల్ ఫోన్ కాన్ఫరెన్స్ నిర్వహిస్తానని వెల్లడించారు. ఈఎన్సీ నుంచి ఏఈ వరకూ అం దరు పూర్తి అలెర్ట్‌గా ఉండా లని మంత్రి ఆదేశాలు జారీ చేశారు.

# మోదీ రూ.151 లక్షల కోట్లు అప్పు చేశారు



హైదరాబాద్, జులై 30 : ప్రధానమంత్రి నరేంద్రమోదీ అప్పులు ఎక్కువగా చేశారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ ఆరోపించారు. అందరూ ప్రధాన మంత్రుల కంటే మోదీ అప్పులు ఎక్కువ చేశారని తెలిపారు. (గురువారం) ఎంసీహెచ్‌ఆర్డీలో సీఎం మీడియాతో మాట్లాడారు. స్వాతంత్ర్యం నుంచి 2014 వరకూ రూ.51లక్షల కోట్ల అప్పు ఉందని వివరించారు. 2014 నుంచి ఇప్పటివరకు ప్రధాని రూ.151లక్షల కోట్ల అప్పులు చేశారని తెలిపారు. విమర్శలు గుర్తు చేసుకుంటూ ఉంటే మనం మనుగడ సాధించలేమని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రామచందర్ రావుకి సీఎం రేవంత్‌రెడ్డి కౌంటర్ ఇచ్చారు. విద్యావ్యవస్థ తమ హయాంలో బలపడిందని తెలిపారు. 28వ స్థానంలో ఉన్న మన రాష్ట్రం ఇప్పుడు దేశంలో 18వ స్థానానికి చేరిందని వ్యాఖ్యానించారు. తాను ఎందుకు రాజీనామా చేయాలని ప్రశ్నించారు. విద్యాశాఖకు మంత్రి లేరని.. తాను రాజీనామా చేయాలని ప్రతిపక్షాల నేతలు అంటున్నారని అన్నారు. విద్యార్థులకు బ్రేక్ ఫాస్ట్, లంచ్, స్నాక్స్ పెట్టినందుకు రాజీనామా చేయాలా అని ప్రశ్నించారు. తాను కూడా మెలకువలు నేర్చుకోవడానికి హార్వర్డ్ వెళ్లానని సీఎం రేవంత్‌రెడ్డి ప్రస్తావించారు.

# అవసరమైతేనే బయటకు రండి - భారీ వర్షాల వేళ సైబరాబాద్ పోలీసుల అడ్వైజ్



హైదరాబాద్:బంగాళాఖాతంలో అల్పపీడనం, నైరుతి రుతు పవనాల ప్రభావంతో తెలంగాణలో రాబోయే రోజుల్లోనూ భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. ఇప్పటికే గత 3 రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. హైదరాబాద్‌లో సైతం ముసురు పట్టి వాన పడుతోంది. అవసరమైతేనే బయటకు రండి : భారీ వర్షాల హెచ్చరికల దృష్ట్యా సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు పలు సూచనలు చేశారు. సంస్థలు, కంపెనీలు, సాధ్యమైనచోట వర్క్‌ఫ్రంహోం అమలు చేయాలని తెలిపారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి ఉద్యోగులకు విడతల వారీగా ముందస్తు లాగౌట్ చేయాలని కోరారు. లాగౌట్ టైంని పోలీసులకు ఈ మెయిల్ ద్వారా తెలపాలని సూచించారు. దీనివల్ల ట్రాఫిక్ రద్దీ, అత్యవసర సేవలకు ఆటంకం లేకుండా ఉంటుందని పేర్కొన్నారు. అవసరమైతేనే ప్రజలు బయటకు రావద్దని సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు సూచించారు. సీపీ వీసీ సజ్జనర్ సూచనలు : హైదరాబాద్? నగరంలో భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని, వాతావరణ శాఖ హెచ్చరికలను ఎప్పటికప్పుడు గమనించాలని సీపీ వీసీ సజ్జనర్ సూచించారు. వర్ష సూచనల ఆధారంగా ప్రయాణాలను ముందుగానే ప్లాన్ చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. పంజాగుట్ట, ఖైరతాబాద్ జంక్షన్లలో ట్రాఫిక్ పరిస్థితులను స్వయంగా పరిశీలించిన సీపీ, జీహెచ్ఎంసీతో పాటు అన్ని శాఖలతో సమన్వయంగా చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. తెరిచి ఉన్న మ్యాన్‌హోళ్లు, తెగిన విద్యుత్ వైర్లు, స్తంభాలకు దూరంగా ఉండాలని హెచ్చరించారు. లోతట్టు ప్రాంతాలు, ఫ్లైఓవర్ల వద్ద వేగం తగ్గించి జాగ్రత్తగా ప్రయాణించాలని, మరో రెండు రోజుల పాటు భారీ వర్షాల అవకాశం ఉందని, అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని విజ్ఞప్తి చేశారు. అత్యవసర పరిస్థితులు, ట్రాఫిక్ సహాయం కోసం డయల్ 100కు కాల్ చేయాలని, ట్రాఫిక్ పోలీసుల అడ్వైజరీలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఆశ్చర్యపోయిన శ్రీధర్ బాబు : మరోవైపు అంబర్‌పేట స్టీల్ బ్రిడ్జి కింద ప్రధాన రహ దారిపై మోకాళ్ల లోతు నిలిచిన వరద నీరు నిలిచింది. ఈ దృశ్యాన్ని చూసి ఆశ్చర్యానికి గురైన మంత్రి శ్రీధర్ బాబు, ఈ పరిస్థితికి కారణాలు అడిగి తెలుసుకున్నారు. తక్షణమే రోడ్డు మరమ్మత్తులు చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. తగ్గిన పర్యాటకులు : భాగ్యనగరాన్ని ముసురు వీడడం లేదు. గత మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షం ద్యారు. ట్యాంక్ బండ్‌పై కురుస్తున్న వానకు అటుగా వెళ్తున్న వాహనదారులు తడుచుకుంటూ వారి వారి గమ్యస్థానాలకు చేరుకుంటున్నారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి పర్యాటకులు కూడా ఎవరు రాకపోవడంతో ట్యాంక్ బండ్ పరిసర ప్రాంతాలు నిర్మానుష్యంగా మారాయి. అలాగే వరద నీరు హుస్సేన్ సాగర్?లోకి భారీగా చేరడంతో నిండుకుండలా మారింది. జిల్లాలకు వాతావరణ కేంద్రం హెచ్చరికలు జారీ : తీవ్ర వాయుగుండం ప్రభావంతో ఇవాళ రాష్ట్రంలో అతి నుంచి అత్యంత భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. ఉమ్మడి ఆదిలాబాద్‌తో పాటు జగిత్యాల జిల్లాకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. ఉమ్మడి ఆదిలాబాద్‌తో పాటు జగిత్యాల జిల్లాలో అత్యంత భారీ వర్షం కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఉమ్మడి నిజామాబాద్?తో పాటు రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో అతి భారీ వర్షం కురిసే అవకాశం ఉన్నందున ఈ జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలను జారీ చేసింది. ఉమ్మడి రంగారెడ్డి, హైదరాబాద్, మెదక్‌తో పాటు హన్మకొండ, జనగాం, వరంగల్, మహబూబ్ బాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో భారీ వర్షం కురిసే అవకాశం ఉందని తెలిపిన వాతావరణ శాఖ ఈ జిల్లాలకు ఎల్లో హెచ్చరికలను జారీ చేసింది. మిగతా అన్ని జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందని తెలిపింది.

# మరోసారి తెరపైకి ఫార్ములా ఈ కార్‌రేస్ కేసు



హైదరాబాద్:ఫార్ములా ఈ కార్ రేస్ కేసు మరోసారి తెరపైకి వచ్చింది. ఫార్ములా ఈ-కారు రేసు కేసు విచారణలో భాగంగా మాజీ మంత్రి,బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శుక్రవారం నాంపల్లి ఏసీబీ ప్రత్యేక కోర్టుకు హాజరుకానున్నా రు. ఈ కేసులో ట్రయల్ ప్రారంభం కానుం డటంతో కోర్టు ఆదేశాల మేరకు ఆయన వ్యక్తిగతంగా హాజరవుతున్నారు. అసలు ఫార్ములా ఈ కార్ రేస్ వివాదం ఏమిటంటే? : గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో హైదరాబాద్‌లో నిర్వహించిన ఫార్ములా ఈ-రేస్ నిబంధనలకు విరుద్ధంగా జరిగిందనేది ప్రధాన ఆరోపణ. క్యాబినెట్ అనుమతి లేకుండానే రూ.55 కోట్ల ప్రభుత్వ నిధులను యూకేకు చెందిన ఫార్ములా ఈ ఆపరేషన్స్ (ఎఫ్?ఈఓ) సంస్థకు బదిలీ చేశారని కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాత ఏసీబీ దర్యాప్తు చేపట్టి కోర్టులో ఛార్జ్‌షీట్ దాఖలు చేసింది. అయితే ఈ ఆరోపణలను కేటీఆర్ పూర్తిగా తోసిపుచ్చారు. ప్రజల దృష్టిని మళ్లించేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం ఈ కేసులను తెచ్చిందని విమర్శించారు. ఏసీబీ దాఖలు చేసిన ఛార్జ్‌షీట్‌లో గత ప్రభుత్వంలో మున్సిపల్ శాఖ మంత్రి ఉన్న కేటీఆర్‌ను ప్రధాన నిందితుడిగా (ఏ1) పేర్కొన్నారు. ఈ కేసులో అప్పటి మున్సిపల్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అరవింద్ కుమార్ (ఏ2), హెచ్ఎండీఏ మాజీ చీఫ్ ఇంజనీర్ బీఎల్ఎన్ రెడ్డి (ఏ3) లతో పాటు క్రీడా కన్సల్టెంట్ కిరణ్ మల్లేశ్వరరావు (ఏ4), ఎఫ్ఈఓ ప్రతినిధి అల్బెర్టో లాంగో (ఏ5)లను కూడా నిందితులుగా చేర్చారు. జైల్లో పెట్టాలని చూస్తున్నారు : ఫార్ములా ఈ-కార్ రేసింగ్ కేసులో కేటీఆర్ ఇప్పటికే ఏసీబీ విచారణకు పలుమార్లు హాజరయ్యారు. గతంలో విచారణకు హాజరైన సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ చట్టాలపై ఉన్న గౌరవంతో విచారణకు వెళ్లానని ఆయన వివరించారు. ఒకటే ప్రశ్నను ఏసీబీ అధికారులు తిప్పి తిప్పి అడిగారని, అసలు ఈ కేసులో అవినీతి ఎక్కడ ఉందని అవినీతి నిరోధక శాఖ అధికారులని తానే ప్రశ్నించినట్లుగా కేటీఆర్ చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి గతంలో జైలుకెళ్లినందుకు, తమను కూడా జైల్లో పెట్టాలని చూస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. కోర్టు సమన్లు : ఈ కేసులో ఏ1గా ఉన్న కేటీఆర్‌తో పాటు మిగిలిన నిందితులకు నాంపల్లి ఏసీబీ ప్రత్యేక కోర్టు మే 14న సమన్లు జారీ చేస్తూ జూలై 31న కోర్టుకు హాజరుకావాలని ఆదేశించింది. ట్రయల్‌లో ఇది తొలి విచారణ కావడంతో నిందితులంతా తప్పనిసరిగా వ్యక్తిగతంగా హాజరుకావాల్సి ఉంది. న్యాయపరమైన ప్రక్రియ: గతంలో ఈ కేసులో ఎవరూ అరెస్టు కాకపోవడంతో, రేపటి విచారణలో కోర్టుకు వ్యక్తిగత పూచీకత్తు, పర్సనల్ బాండ్ సమర్పించే ప్రక్రియను నిందితులు పూర్తి చేయాల్సి ఉంటుంది.

# ఉదయ్ కృష్ణారెడ్డి రిమాండ్ రిపోర్టులో వెలుగులోకి కీలక అంశాలు



హైదరాబాద్, జులై 30 : ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి రిమాండ్ రిపోర్టులో కీలక అంశాలు వెలుగులోకి వచ్చాయి. మహిళా ట్రైనీ ఐపీఎస్‌పై లైంగిక వేధింపుల కేసులో అరెస్ట్ అయిన కృష్ణారెడ్డి ప్రస్తుతం చంచల్‌గూడా జైల్లో ఉన్నాడు. ఇన్‌స్టాగ్రామ్‌లో ముందుగా ఇద్దరికీ పరిచయం ఏర్పడిందని.. ఆ తర్వాత జాతీయ పోలీస్ అకాడమీలో వారు దగ్గరయ్యారని పోలీసులు తెలిపారు. ఉదయ్ జీవిత చరిత్ర చూసి ట్రైనీ ఐపీఎస్ అధికారిని పరిచయం పెంచుకున్నారని వెల్లడించారు. ఐపీఎస్ అధికారినిపై ఉదయ్ కృష్ణారెడ్డి దాడి చేశాడు..మహిళా ట్రైనీ ఐపీఎస్, ఉదయ్ కృష్ణారెడ్డి మధ్య చాలాకాలం పాటు సంబంధాలు కొనసాగాయని పోలీసులు రిమాండ్ రిపోర్టులో చెప్పుకొచ్చారు. కొన్ని రోజుల తర్వాత వీరి మధ్య విభేదాలు వచ్చాయని తెలిపారు. ఇతరులతో మాట్లాడితే లేడీ అధికారిని ఉదయ్ విపరీతంగా వేధించే వారని అన్నారు. కొన్ని సందర్భాల్లో ట్రైనీ ఐపీఎస్ అధికారినిపై దాడి చేసిన సంఘటనలు ఉన్నాయని చెప్పుకొచ్చారు. జాతీయ పోలీస్ వీరు విడిపో యారని వెల్లడించారు.

# నాపై అసత్య ప్రచారాలు చేస్తున్నారు'.. జూబ్లీహిల్స్ సీఐపై బాధితురాలి ఆరోపణ



హైదరాబాద్, జులై 30: జూబ్లీహిల్స్ సీఐ శ్రీనివాసులు రెడ్డి కేసులో విచారణను పోలీసులు వేగవంతం చేశారు. ఈ కేసుకు సంబంధించి సీఐను జూబ్లీహిల్స్ డీసీపీ విచారించారు. ఇక, తనపై అసత్య ప్రచారాలు చేస్తున్నారని, చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు బాధితురాలు ఫిర్యాదు చేసింది. సీఐ శ్రీనివాసులు రెడ్డికి మద్దతుగా కొంతమంది పోలీస్ అధికారులే తనపై నెగిటివ్‌గా ప్రచారం చేస్తున్నారని ఆరోపించింది. మరోవైపు శ్రీనివాసులు రెడ్డికి జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 5లో ఉండే ప్రముఖ బిల్డర్ అత్యంత సన్నిహితుడని సమాచారం.సీఐని అధికారులు సస్పెండ్ చేసిన తరువాత.. ఆయనకు సహాయ సహకారాలు అందిస్తున్నాడంటూ బిల్డర్ వ్యవహారంపై కూడా ఉన్నతాధికారులు దృష్టికి బాధితురాలు తీసుకెళ్లింది. శ్రీనివాసులు రెడ్డి బెదిరింపులతో లక్షల రూపాయల ఇచ్చానని.. వాటిని ఆధారాలతో సహా ఫిర్యాదు చేసినట్లు పేర్కొంది. వ్యక్తిగతంగా టార్గెట్ చేసి, నెగిటివ్ ప్రచారం చేస్తున్నారని బాధిత మహిళ ఆరోపించింది.

# ఇంకా సగం మిగిలి ఉన్న'సర్' ప్రక్రియ



హైదరాబాద్:ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా ఓటర్లు తమ వివరాల నమోదు ఫారాలను పూర్తి చేసి సమర్పించడానికి ఇంకా ఐదు రోజులు మాత్రమే మిగిలి ఉంది. అయితే ఇప్పటివరకు హైదరాబాద్?లోని నగర పరిధిలో కేవలం 53.33 శాతం ఫారాలు మాత్రమే అందాయి. రాజకీయ పార్టీల నుంచి స్పందన అంతంత మాత్రంగానే ఉంది. గడువు తేదీ ఆగస్టు 3 లోపు ఫారాలు సమర్పించకపోతే ఓటు హక్కును కోల్పోయే ప్రమాదం ఉందని అధికారులు హెచ్చరించినప్పటికీ, ప్రజల నుంచి స్పందన చాలా తక్కువగా ఉంది. ఫారాలను ఎలా నింపాలో తెలియక ఓటర్లు గందరగోళానికి గురవుతున్నారు. విద్యావంతులు కూడా ఈ ప్రక్రియను అర్థం చేసుకోవడంలో ఇబ్బంది పడుతున్నారు. ప్రస్తుత ప్రక్రియను 2002 నాటి ఓటర్ల జాబితాతో అనుసంధానించడం వల్ల, ప్రజలు తమ పాత ఓటరు వివరాలను వెతుక్కోవడం కష్టంగా మారింది. అప్పట్లో ఓటు హక్కు లేని వారు ఇప్పుడు ఎటువంటి చర్యలు తీసుకోవాలో తెలియక సందిగ్ధంలో ఉన్నారు. ఇంటింటికి వెళ్లి వివరాలు సేకరించని బీఎల్‌వో లు : హైదరాబాద్ పరిధిలోని 15 నియోజ కవర్గాల్లో నమోదు ఫారాలను పంపిణీ వంద శాతం పూర్తయిందని కమిషనర్ ఆర్.వి. కర్ణన్ ప్రకటించారు. అయితే అనేక ప్రాంతాల్లో బూత్ స్థాయి అధికారులు ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరించడం లేదు. దానికి బదులుగా వారు వద్ద కూర్చుని ఓటర్ల వివరాలను నమోదు చేస్తున్నారు. రంగారెడ్డి జిల్లాలోని 8 నియోజక వర్గాల్లో మొత్తం 3,699,743 మంది ఓటర్లు ఉండగా, కేవలం 2,249,089 మంది మాత్రమే ఫారాలను నింపి బీఎల్‌ఓలకు సమర్పించారు. మేడ్చల్ జిల్లాలోని 5 నియోజకవర్గాల్లో మొత్తం 2,979,130 ??మంది ఓటర్లు ఉండగా, కేవలం 1,771,564 మంది మాత్రమే ఫారాలను పూర్తి చేసి సమర్పించారు. ఏజెంట్లు ఎక్కడ : త్వరలో జీహెచ్?ఎంసీ ఎన్నికలు జరగవచ్చనే చర్చ జరుగుతోంది. హైదరాబాద్?లోని చాలా మంది ఓటర్లు స్పందించకపోవడానికి కారణం వారికి ఇప్పటికే గ్రామీణ ప్రాంతాల్లో లేదా తమ సొంత నియోజకవర్గాల్లో ఓటు హక్కు ఉండటమేనని ఒక అభిప్రాయం ఉంది. ఎస్ఐఆర్ వేగవంతం చేయాలని ఎమ్మెల్యే సమీక్ష : ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తిచేయడానికి ఇంకా కేవలం 5 రోజులు మాత్రమే గడువు ఉండటంతో బీఎల్‌ఓలు ఈ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీగణేష్ సూచించారు.

EDITOR PRINTER AND PUBLISHER OWNED BY BILLALPURSARA SHIVA KUMAR, PRINTING AT RIYAZ PRINTING PRESS, S NO 22-8-161, BEHIND NAYAAB HOTEL, CHATTA BAZAR, HYDERABAD, TELANGANA - 500002 AND PUBLISHED FROM H.NO: 2-1-602, TARAKARAMA NAGAR, YELLAMMABANDA, KUKATPALLY, MEDCHEL- MALKAJGIRI DIST, TELANGANA-500 072. PRGI: TGTEL/26/A4985. PHONE NO: +91 8686861338, +91 81215 50907 EMAIL : shivakumarlal@gmail.com

## వైసీపీ పాలనలో ఇసుక అక్రమాల కేసు.. సుప్రీంకోర్టులో వాడీవేడి వాదనలు.



**ఢిల్లీ:** ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాలనలో ఇసుక అక్రమాలపై సుప్రీంకోర్టులో (గురువారం) విచారణ జరిగింది. ఈ సందర్భంగా జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ ఏజీ మషీహ్ ధర్మాసనం ఎదుట వాడీవేడి వాదనలు జరిగాయి. ఇసుక అక్రమాలకు బాధ్యులు ఎవరన్నది ఎన్జీటీ తేల్చాలని జేపీ పవర్ వెంచర్స్ తరఫు న్యాయవాది వాదించారు. తమ పేరుపై ఉన్నవి ఏడు లైసెన్సులు మాత్రమేనని తెలిపారు. అందుకే రూ.7 కోట్ల జరిమానాను కోర్టులో జమ చేశామని చెప్పారు. ఎన్జీటీ జరిమానా విధించిన మిగతా ఇసుక క్వారీల లైసెన్సులన్నీ ప్రభుత్వం పేరుపైనే ఉన్నాయని పేర్కొన్నారు. ఇసుక క్వారీల అసలు యజమానులు ఎవరన్నది ఎన్జీటీయే తేల్చాలని జేపీ పవర్ వెంచర్స్ తరఫు న్యాయవాది కోరారు. ఈ సందర్భంగా ఏపీ ప్రభుత్వం కూడా సుప్రీంకోర్టులో తమ వాదనలను బలంగా వినిపించింది. గతంలో క్వారీలలో మైనింగ్ చేసింది జేపీ పవర్ వెంచర్సే అని ఎన్జీటీ నిర్ధారించిందని ప్రభుత్వం తరఫు న్యాయవాది ఉన్నత న్యాయస్థానం దృష్టికి తీసుకొచ్చారు. ఈ మేరకు రూ.18 కోట్ల జరిమానా విధించిందని పేర్కొన్నారు. దీనిపై ఎన్జీటీలో మరోసారి విచారణ అవసరం లేదని, జరిమానాపై తుది నిర్ణయం సుప్రీంకోర్టే తీసుకోవాలని ఎన్జీటీ కేసును ముగించిందని తెలిపారు.

## జగన్ పర్యటనలో వైఎస్సార్సీపీ కార్యకర్తల అత్యుత్సాహం

**శ్రీకాకుళం జిల్లా :** జగన్ శ్రీకాకుళం జిల్లా పర్యటనలో వైఎస్సార్సీపీ కార్యకర్తలు అత్యుత్సాహం ప్రదర్శించారు. విశాఖపట్నం ఎయిర్‌పోర్టు బయటా, లోపల వైఎస్సార్సీపీ కార్యకర్తలు నినాదాలు చేశారు. చెన్నై–కోల్‌కతా జాతీయ రహదారిపై, విమా ననగరం వైపు నుంచి షీలానగర్ మార్గంలో ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఎయిర్‌పోర్టు లోపలికి వెళ్లే మార్గంలో వాహనాలను వైఎస్సార్సీపీ కార్యకర్తలు అడ్డుకున్నారు.సీదిరి అప్పలరాజు కుమారుడు ఆరవ్ వర్మ చేసిన రోడ్డు ప్రమాదంలో గొర్రెల కాపరి దానయ్య మృతిచెందిన విషయం తెలిసిందే. కుమారుడిని కేసు నుంచి తప్పించేందుకు సాక్ష్యాలను తారుమారు చేశారంటూ అప్పలరాజుపైనా కేసు నమోదైంది. ఇటీవల పోలీసులు ఆయన్ను అరెస్ట్ చేయగా కోర్టు రిమాండ్ విధించింది. దీంతో అప్పలరాజును అంపోలు జైలుకు తరలించారు.



తాజాగా సీదిరి అప్పలరాజుతో ములాఖత్ అయ్యేందుకు జగన్ శ్రీకాకుళంలోని అంపోలు జైలు బయలు దేరారు. అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు : రిమాండ్‌లో ఉన్న సీదిరి అప్పలరాజుతో ములాఖత్ అయ్యేందుకు మాత్రమే మాజీ ముఖ్యమంత్రి జగన్‌కు అనుమతి ఉందని ర్యాలీలు, జన సమీకరణ, బహిరంగ సభలకు ఎలాంటి అనుమతీ లేదని శ్రీకాకుళం జిల్లా ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి ఇప్పటికే స్పష్టం చేశారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా నిబంధనల్ని అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలుంటాయని హెచ్చరించారు. అంపోలు జైల్లో ఉన్న అప్పలరాజును కలిసేందుకు శ్రీకాకుళం జిల్లా వైఎస్సార్సీపీ అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ పెట్టుకున్న దరఖాస్తు మేరకే అనుమతి ఇచ్చామని చెప్పారు. ఎనిమిది వాహనాలకు మాత్రమే అవకాశమిచ్చినట్లు ఎస్పీ తెలిపారు. వచ్చే నెల 1న ప్రధాని మోదీ పర్యటన ఉన్న నేపథ్యంలో ఆంక్షలు ఉన్నాయన్నారు. ఊరూరా జన సమీకరణ: పోలీసుల ఆంక్షలను కాదని వైఎస్సార్సీపీ నేతలు జన సమీకరణ చేశారు. జిల్లాలోని ఒక్కో నియోజకవర్గం నుంచి 4 నుంచి 5 వేల మంది చొప్పున వచ్చేలా ప్రణాళిక రచించారు.

## 2027లో భూగ్రహ చరిత్రలోనే అత్యంత తీవ్రమైన వేడి!



**అమరావతి, జులై 30:** ప్రపంచవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు ఆందోళనకర స్థాయిలో పెరుగుతున్నాయని 2027లో భూగ్రహ చరిత్రలోనే అత్యంత తీవ్రమైన వేడి నమోదయ్యే అవకాశం ఉందని ప్రముఖ శాస్త్రవేత్త, మాజీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ శేఖర్ మండే హెచ్చరించారు. విజయవాడలోని స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ పదో స్నాతకోత్సవ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పర్యావరణ మార్పులు, యువనిపుణుల బాధ్యతలపై విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. 2023–24 అత్యంత వేడి సంవత్సరాలుగా నమోదయ్యాయని డాక్టర్ శేఖర్ గుర్తుచేశారు. భవిష్యత్తులో నిర్మించే భవనాలు, నగరాలు, మౌలిక సదుపాయాలు పర్యావరణహితంగా ఉండేలా చూడాలన్నారు. భూమికి నష్టం కలిగించని రీతిలో కొత్త డిజైన్లకు రూపకల్పన చేసే బాధ్యత ఆర్కిటెక్ట్‌లు, పట్టణ ప్రణాళికా నిపుణులపైనే ఉందని ఆయన వెల్లడించారు. భవిష్యత్తులో యువత ఏ రంగం ఎంచుకున్నా విలువలను పాటిస్తూ ముందుకు సాగితేనే దేశానికి, ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఆకాంక్షించారు. వర్షాకాలంలోనూ భగ్గుమంటున్న ఎండలు : మరోవైపు ప్రస్తుతం వర్షాకాలంలోనూ ఎండలు భగ్గుమంటున్నాయి. పగటి ఉష్ణోగ్రతలు ఇంచుమించు 36డిగ్రీలకుపైనే నమోదవుతుండగా రాత్రిళ్లు కనిష్ఠ ఉష్ణోగ్రతలు 33 డిగ్రీల వరకూ రికార్డవుతున్నాయని వాతావరణ శాఖ వెల్లడిస్తోంది. ఫలితంగా వేడి గాలి, నిద్ర లేమి సమస్యలు వెంటాడుతున్నాయి. వేసవిలో మిట్టమధ్యాహ్నం తీవ్రమైన ఉష్ణోగ్రత మనకు అలవాటే అయినా, రాత్రిళ్లు సైతం అదే పరిస్థితి నెలకొనడానికి 'హీట్ డోమ్' కారణమని వాతావరణ శాస్త్రవేత్తలు వివరిస్తున్నారు. హీట్ డోమ్ అంటే భూమి ఉపరితలంలో ఏర్పడే కంటికి కనిపించని వాతావరణం. ఇది వేడిని బంధించి ఉంచడం వల్ల రాత్రి వేళల్లోనూ వాతావరణం వేడిగా అనిపిస్తోంది. గ్లోబల్ వార్మింగ్ ఫలితంగా మన వాతావరణంలో నిరంతరం ఇటువంటి మార్పులు వస్తున్నాయనే వాస్తవాన్ని గుర్తించాలి. ముఖ్యంగా హీట్ డోమ్ వంటి అరుదైన సహజ దృగ్విషయాలు వేసవిలో మరింత స్పష్టంగా కనిపిస్తుంది. దీంతో మొక్కలు పెంచడం, పచ్చదనాన్ని విస్తరించడమే హీట్ డోమ్స్ పరిష్కారానికి ఏకైక విరుగుడుగా శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. రాబోయే రోజుల్లో మరింత ఆందోళనకరంగా : ప్రపంచవ్యాప్తంగా వాతావరణ పరిస్థితులు రానున్న రోజుల్లో మరింత ఆందోళనకరంగా మారనున్నాయని తెలుస్తోంది. ప్రస్తుతం పసిఫిక్ మహాసముద్రంలోని ఉష్ణ మండల ప్రాంతంలో కొనసాగుతున్న ఎల్‌నినో పరిస్థితులు రానున్న రోజుల్లో అత్యంత వేగంగా బలపడనున్నాయని ప్రపంచ వాతావరణ సంస్థ (ఔనూ) తాజాగా హెచ్చరించింది. ఈ ప్రభావంతో ప్రపంచంలోని అనేక ప్రాంతాల్లో తీవ్రమైన వడగాల్పులు, కరవు, అకాల భారీ వర్షాలు, వరదలు వంటి విపరీతమైన వాతావరణ మార్పులు సంభవించే ప్రమాదం ఉందని వెల్లడించింది. ఇటీవల విడుదల చేసిన 'డబ్ల్యూఎంవో గ్లోబల్ సీజనల్ క్లైమేట్ అప్డేట్' నివేదికలో జులై నుంచి సెప్టెంబర్ మధ్యకాలంలో ఎల్‌నినో మరింత బలమైన దశలోకి ప్రవేశించి తీవ్రరూపం దాల్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని పేర్కొంది. దీంతో ప్రపంచవ్యాప్తంగా వాతావరణ పరిస్థితుల్లో గణనీయమైన మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉందని తెలిపింది. 40 శాతం లోటు వర్షపాతం : ఇప్పటికే దేశంలో ఎల్‌నినో పరిస్థితులు ప్రారంభమైనట్లు భారత వాతావరణ శాఖ (ఐఎండీ) ప్రకటించింది. నైరుతి రుతుపవనాల కాలంలో ఇవి మరింత బలపడే అవకాశం ఉందని తెలిపింది. సాధారణంగా ఎల్‌నినో ప్రభావంతో భారత్‌లో వర్షపాతం తగ్గుతుంది. ఈ ఏడాది జూన్ నెలలో దేశవ్యాప్తంగా సుమారు 40 శాతం లోటు వర్షపాతం నమోదవడానికి ప్రధాన కారణాల్లో ఎల్‌నినో కూడా ఒకటని ఐఎండీ పేర్కొంది. ముఖ్యంగా మధ్య భారతదేశంలో 50.4 శాతం వర్షాభావం నమోదైంది.

## సూపర్ ఎల్‌నినోపై రైతుల్లో అవగాహన కల్పించాలి



**అమరావతి, జులై 30:** రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో నీటిపారుదలశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు (గురువారం) భేటీ అయ్యారు. సూపర్ ఎల్‌నినో పరిస్థితులపై చర్చించారు. సూపర్ ఎల్‌నినో, తద్వారా రాష్ట్రంలో నెలకొన్న సాగు నీటి సంక్షోభంపై రైతుల్లో అవగాహన కల్పించాలని పవన్ సూచించారు. రైతులతో ప్రత్యక్ష సమావేశాలు నిర్వహించి పరిస్థితులను వివరించాలన్నారు. సంక్షోభ నివారణకు ప్రత్యామ్నాయ మార్గాల అన్వేషణపై దృష్టి సారించాలని అన్నారు. ఏలేరు ప్రాజెక్టు నుంచి 1,000 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినందుకు నిమ్మలకు పవన్ కల్యాణ్ కృతజ్ఞతలు తెలిపారు. నీటి విడుదలతో పిఠాపురం, పెద్దాపురం, జగ్గంపేట రైతులకు సాగునీటి సమస్యకు ఊరట లభించిందని పవన్ అన్నారు. సూపర్ ఎల్‌నినో ప్రభావంపై గ్రామస్థాయిలో ప్రచారం చేపట్టాలని సూచించారు. ప్రతి రైతు పీఎం ఫసల్ బీమా యోజనలో చేరేలా అవగాహన కల్పించాలన్నారు. ప్రస్తుతం ప్రతి నీటి బొట్టు విలువైనదే అని... నీటి వృథాను అరికట్టాలని చెప్పారు. కాలువల్లో పూడిక తొలగింపు, నీటి గట్టుల లీకేజీల నివారణపై దృష్టి సారించాలన్నారు. కాకినాడ జిల్లా, పిఠాపురంపై ప్రత్యేక దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. ఎల్‌నినోపై రైతులకు అవగాహన కల్పించడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు బాధ్యత తీసుకోవాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సూచనలు చేశారు. ఈ సందర్భంగా భుజం శస్త్రచికిత్స చేయించుకున్న పవన్‌ను మంత్రి నిమ్మల రామానాయుడు పరామర్శించారు. త్వరగా కోలుకుని ప్రజాసేవలో మరింత చురుగ్గా పాల్గొనాలని నిమ్మల ఆకాంక్షించారు.

## ఏపీడీఏఎస్‌సీఏసీ ఎండీగా ఎం.వేణుగోపాల్ రెడ్డికి అదనపు బాధ్యతలు



**అమరావతి, జులై 30:** ఏపీ డెయిరీ డెవలప్‌మెంట్, అనుబంధ సంస్థ బాధ్యతలను మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డికి అదనపు బాధ్యతలుగా అప్పగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు జీఓఆర్‌టీ.నం128ను జారీ చేసింది. ఏపీడీఏఎస్‌సీఏసీ మేనేజింగ్ డైరెక్టర్ కార్యాలయ బాధ్యతలను కూడా ఎం. వేణుగోపాల్ రెడ్డి నిర్వహించనున్నారు. కార్పొరేషన్‌కు సంబంధించిన పరిపాలనా, అధికారిక వ్యవహారాలతో పాటు అన్ని ఆర్థిక వ్యవహారాల నిర్వహణ బాధ్యతలనూ వేణుగోపాల్ రెడ్డి చేపట్టనున్నారు. తదుపరి ప్రభుత్వ ఆదేశాలు వెలువడే వరకు ఈ ఆదేశాలు అమల్లో ఉంటాయని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కార్పొరేషన్‌కు చెందిన అధికారులు, సిబ్బంది అంతా ఎం.వేణుగోపాల్ రెడ్డితో సమన్వయం చేసుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. అలాగే, మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్‌గా తన బాధ్యతలతో పాటు ఈ అదనపు బాధ్యతలను సమర్థంగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం సూచించింది. ఇటీవల పదవీ విరమణ చేసిన అధికారి బి.రవి ప్రకాష్ రెడ్డి స్థానంలో తాత్కాలికంగా ఈ బాధ్యతలను ఎం.వేణుగోపాల్ రెడ్డికి అప్పగిస్తూ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.

## శ్రీరంగపట్నంలో తెలంగాణ తరహా బోనాల జాతర

**శ్రీరంగపట్నం:** తెలంగాణలో అత్యంత వైభవంగా జరిగే బోనాల ఉత్సవాలు అందరికీ సుపరిచితమే. అచ్చం అలాంటి వేడుకే ఆంధ్రప్రదేశ్‌లోని ఓ పల్లెలో అంగరంగ వైభవంగా జరిగింది. తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ మండలం శ్రీరంగపట్నం గ్రామంలో కొలువైన మోదుకొండమ్మ తల్లి జాతర భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా సాగింది. ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని ఈ వేడుకలను కన్నుల పండువగా నిర్వహించారు. వందల ఏళ్ల చరిత్ర ఉన్న ఈ ఆధ్యాత్మిక ఘట్టంలో ఊరంతా భక్తి పారవశ్యంతో మునిగిపోయింది. తెలంగాణను తలపించేలా బోనాల కోలాహలం : శ్రీరంగపట్నంలో జరిగిన మోదుకొండమ్మ జాతర పూర్తిగా తెలంగాణ బోనాల వేడుకలను తలపించింది. గ్రామానికి చెందిన మూడు వేల మందికి పైగా ఆడపడుచులు ఈ జాతరలో ఉత్సాహంగా పాల్గొన్నారు. మహిళలు, యువతులు, చిన్నపిల్లలు అంతా సంప్రదాయ వస్త్రధారణలో ముస్తాబయ్యారు. తలపై బోనాలు ఎత్తుకుని ఊరేగింపుగా బయలుదేరారు. డప్పు వాయిద్యాలు, నృత్యాల నడుమ అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. అనంతరం భక్తిశ్రద్ధలతో మోదుకొండమ్మకు ఆ బోనాలను సమర్పించారు. అనాదిగా వస్తున్న ఆచారం : ఆషాఢ మాసంలో అమ్మవారికి ఇలా బోనాలు సమర్పించడం శ్రీరంగపట్నం గ్రామంలో ఆనవాయితీగా వస్తోంది. ఇది ఈనాటి ఆచారం కాదు. అనాదిగా తమ పూర్వీకుల నుంచి వస్తున్న సంప్రదాయమని గ్రామ పెద్దలు చెబుతున్నారు. ఈ ఏడాది ఈ జాతర మహోత్సవం 101వ వసంతంలోకి అడుగు పెట్టింది. 101వ జాతర కావడంతో నిర్వాహకులు, గ్రామస్థులు భారీ ఏర్పాట్లు చేశారు. దీంతో మునుపెన్నడూ లేని విధంగా బోనాలు సమర్పించేందుకు మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. స్వగ్రామాలకు క్యూ కట్టిన ఆడపడుచులు : ఈ మోదుకొండమ్మ జాతరకు మరో ప్రత్యేకత కూడా ఉంది.



శ్రీరంగపట్నం గ్రామానికి చెందిన ఎంతోమంది ఉపాధి నిమిత్తం వివిధ ప్రాంతాల్లో స్థిరపడ్డారు. కొందరు ఉద్యోగాల కోసం వెళ్లగా, మరికొందరు వ్యాపారాల కోసం పట్టణాలకు వలస వెళ్లారు. అలాగే వివాహాలు చేసుకుని ఇతర ప్రాంతాలకు వెళ్లిన ఆడపడుచులు సైతం ఈ జాతర కోసం స్వగ్రామానికి చేరుకున్నారు. సుదూర ప్రాంతాల నుంచి ప్రత్యేకంగా విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. బోనాలు సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు. పాడిపంటలు సమృద్ధిగా పండాలని : గ్రామంలో పాడిపంటలు సమృద్ధిగా పండాలని ఈ సందర్భంగా భక్తులు అమ్మవారిని వేడుకున్నారు. ప్రజలందరూ ఎలాంటి రోగాల బారిన పడకుండా, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ప్రార్థించారు. ఊరి ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని, కష్టాలను కడతేర్చాలని మోదుకొండమ్మ తల్లిని భక్తితో కొలిచారు. పిల్లాపాపల చల్లగా చూడాలని వేడుకున్నారు. ఆధ్యాత్మిక శోభతో మార్మోగిన పల్లె : జాతర సందర్భంగా శ్రీరంగపట్నం గ్రామమంతా పండుగ వాతావరణం నెలకొంది. ఎటు చూసినా పసుపు, కుంకుమలు, తలపై బోనాలతో మహిళలు సందడి చేశారు. మోదుకొండమ్మ ఆలయ పరిసరాలు భక్తజన సందోహంతో ఉదయం నుంచే కళకళలాడాయి. సంప్రదాయ వాయిద్యాల హోరు, డప్పుల మోతతో పల్లె వీధులు మార్మోగాయి. భక్తి గీతాల ఆలాపనల మధ్య వేడుకలు వైభవంగా సాగాయి.

## విద్యుత్ సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలి - అధికారులకు మంత్రి గొట్టిపాటి ఆదేశం



**అల్లూరి:** అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం ప్రారంభోత్సవానికి ప్రధ ానమంత్రి నరేంద్ర మోదీ రానున్న నేపథ్యంలో విద్యుత్ సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలని ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అధికారులను ఆదేశించారు. విశాఖపట్నంలోని ఈపీడీసీఎల్ అధికారులతో గురువారం వర్చువల్‌గా నిర్వహించిన సమీక్షలో విమానాశ్రయ ప్రారంభోత్సవ సమయంలో విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం తలెత్తకుండా అన్ని ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. అవసరమైతే అదనపు సిబ్బందిని క్షేత్రస్థాయిలో నియమించి నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారుపీఎం సూర్యఘర్, కుసుమ్ పనుల వేగవంతం చేయాలి: కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న పీఎం సూర్యఘర్, పీఎం కుసుమ్, ఆర్డీఎస్ఎస్ పథకాల పనులను వేగవంతం చేయాలని మంత్రి సూచించారు. పీఎం కుసుమ్, ఆర్డీఎస్ఎస్ పనులను ఈ ఏడాది డిసెంబరు నాటికి పూర్తి చేస్తామని అధికారులు వెల్లడించారు. ఆర్డీఎస్ఎస్ పనుల వల్ల డిస్కంపై రూ.100 కోట్లకు పైగా ఆర్థిక భారం తగ్గిందని తెలిపారు. విద్యుత్ నష్టాల నివారణకు భూగర్భ విద్యుత్ లైన్ల ఏర్పాటు పనులు శ్రీకాకుళం, విశాఖపట్నం, అనకాపల్లి, తూర్పుగోదావరి జిల్లాల్లో కొనసాగుతున్నట్లు మంత్రికి అధికారులు వివరించారు. గోదావరి పుష్కరాల విద్యుత్ శాఖ సమాయత్తం: రానున్న గోదావరి పుష్కరాల దృష్ట్యా విద్యుత్ శాఖ పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉండాలని మంత్రి ఆదేశించారు. మార్చి 2027 నాటికి పుష్కరాల కు సంబంధించిన అన్ని విద్యుత్ మౌలిక సదుపాయాల పనులు పూర్తి చేయాలని సూచించారు. పుష్కరాల నాటికి కొత్తగా 19 సబ్‌స్టేషన్లను అందుబాటులోకి తీసుకురానున్నట్లు అధికారులు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల మంజూరును వేగవంతం చేయాలని మంత్రి ఆదేశించగా, జూన్ నాటికి అర్హులైన దరఖాస్తుదారులకు కనెక్షన్లు మంజూరు చేసినట్లు అధికారులు వివరించారు. గత ఏడాదిలో సుమారు 12 వేల వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు అందించినట్లు వెల్లడించారు. దళారుల మాటలు నమ్మి మోసపో వద్దు: విద్యుత్ శాఖలో ఉద్యోగాలు ఇప్పిస్తా మంటూ డబ్బులు వసూలు చేసే దళారులను నమ్మి మోసపోవద్దని మంత్రి ప్రజలను హెచ్చరించారు. ఉద్యోగ నియామకాలు పూర్తిగా మెరిట్ ప్రాతిపదికనే జరుగుతున్నాయని స్పష్టం చేశారు. ఇప్పటివరకు విద్యుత్ శాఖ పరిధిలో 450 కారుణ్య నియామకాలు చేపట్టినట్లు గొట్టిపాటి రవికుమార్ తెలిపారు.

## గాదె సాయి కృష్ణ కేసులో సిట్ దర్యాప్తు ముమ్మరం.



**ఢిల్లీ, జులై 30 :** ఆంధ్రప్రదేశ్‌లో సంచలనం సృష్టించిన గాదె సాయి కృష్ణ లాకప్ డెత్ కేసు (దర్యాప్తులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో నిందితుడిగా ఉన్న మాజీ సీఐ నాగరాజును ప్రత్యేక దర్యాప్తు బృందం (గురువారం) విజయవాడ కోర్టులో హాజరుపరిచింది. కస్టడీ విచారణకు సంబంధించి ఇరుపక్షాల న్యాయవాదులు తమ వాదనలు వినిపించారు. ఈ కేసులో నాగరాజు ఏ1గా ఉన్న విషయం తెలిసిందే. ఆయన ప్రస్తుతం రాజమండ్రి సెంట్రల్ జైల్లో ఉన్నారు. మాజీ సీఐ నాగరాజును ప్రతిరోజూ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మాత్రమే సిట్ అధికారులు విచారించాలని కోర్టు స్పష్టం చేసింది. విచారణ సమయం ముగిసిన తర్వాత కూడా నాగరాజుకు భద్రత కల్పించాలని, సీసీ కెమెరాల పర్యవేక్షణలో ఉంచాలని న్యాయస్థానం ఆదేశించింది. కోర్టు అనుమతి అనంతరం మాజీ సీఐ నాగరాజును సిట్ అధికారులు తమ కస్టడీలోకి తీసుకుని సిట్ కార్యాలయానికి తరలించనున్నారు. సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు నాగరాజును వారం రోజుల పాటు కస్టడీలో ఉంచి విచారించనున్నారు. ఈ కేసు విచారణ ప్రక్రియలో పారదర్శకత పాటించాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. విచారణ మొత్తం ఆడియో, వీడియో రూపంలో రికార్డు చేయాలని సిట్ అధికారులను ఆదేశించింది. అలాగే విచారణ సమయంలో చట్టపరమైన నిబంధనలు పూర్తిగా పాటించాలని సూచించిందిసాయి కృష్ణ లాకప్ డెత్ కేసు ఏపీవ్యాప్తంగా తీవ్ర చర్చకు దారితీసిన నేపథ్యంలో సిట్ దర్యాప్తుపై అందరి దృష్టి నెలకొంది. విచారణలో వెలుగులోకి వచ్చే వివరాలు ఈ కేసు దర్యాప్తులో కీలకంగా మారే అవకాశం ఉంది.